AL - HILAL

నెలవంక

మాస పత్రిక

Vol 6, Issue: 46 August - 2010 مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى



రమజాను బహుమతులు గెలుచుకోండి

కర్తవ్యం పిలుస్తోంది... కదలి రండి!

సుప్రసిద్ధ హదీసు గ్రంథాల పరిచయం

ఔదార్యాన్ని, త్యాగ నిరతిని నేర్పే శిక్షణా కాలం

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఉచితం

"తన నూలును గట్టిగా వడికిన తరువాత, స్వయంగా తనే ముక్కలుగా త్రెంచివేసిన స్త్రీ మాదిరిగా అయిపోకండి". (దివ్య ఖుర్ఆన్ - 16: 92)

మీరు దేవునితో చేసే ప్రమాణాలైనా, సాటి మనుషులతో చేసే ప్రమాణాలైనా – అవి ఎంతో ముఖ్యమైనవి. వాటికి కట్టుబడి ఉండాలి. చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాలి. ఇచ్చిన మాటను నిలుపుకోవాలి. దీనికి విరుద్ధంగా ప్రవర్తించినవారు పగలంతా ఎంతో శ్రమతో నూలు వడికి సాయంత్రమయ్యేసరికి తమ స్వహస్తాలతోనే పచ్చి దారాన్ని త్రెంచివేసుకున్న మూర్ఖ స్త్రీ వంటివారే. కాబట్టి చేసిన ప్రమాణాన్ని – ముఖ్యంగా అల్లాహ్‌తో చేసుకున్న ఒడంబడికను – ఆషామాషిగా భావించకూడదు.



నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 6, ISSUE: 46
AUGUST 2010

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhammad Azeezur Rahman

EXECUTIVE EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONES
M.Azeezur Rahman
66104547
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc-kw.com

DESIGN
Noushad Zainulabdeen

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....

దృక్పథం 2
సహరీ, ఇఫ్తార్ 3
కర్తవ్యం పిలుస్తోంది... 4
త్యాగనిరతిని నేర్పే శిక్షణా కాలం 6
హదీసు గ్రంథాల పరిచయం 8
ధర్మ సందేహాలు 10
మృదువుగా మెలగండి 11
ఓ మనిషీ! పాపాల నుండి రక్షించుకో 12
ఐపిసి వార్తలు 14
నేటి బాలలే రేపటి పౌరులు 15
షిర్కు పుట్టు పూర్వోత్తరాలు 16
ధన పిపాసి ఖారూన్ 18




كلمة العدد ◄ السحور والإفطار ◄ فريضتكم تدعو ◄ رمضان مدرسة تربية
كن لينا ◄ الفتاوى الشرعية ◄ الحذر الحذر من الذنوب ◄ روضة الأطفال
أنشطة اللجنة ◄ كيف بدأ الشرك ◄ قصة قارون

దృక్పథం

بسم الله الرحمن الرحيم

స్వీయ సంస్కరణకు సువర్ణావకాశం రమజాన్



అదిగో రమజాను మాసం! మరోసారి మన వైపునకు మలయ మారుతంలా కదలి వస్తోంది... అదిగదిగో శుభకరాల మాసం!! పాషాణం లాంటుల్లో మొలకెత్తగ వేచివున్న (విశ్వాస) బిత్తనానికై దైవ కారుణ్యాన్ని మోసుకొచ్చే మేఘ మాలికలా మెలికలు తిరుగుతూ వస్తోంది.... అల్లదిగో ఉపవాసాల మాసం!!! మండుటెండల్లో మాడుతున్న శ్రమజీవుల నేద తీర్చే సుధా ఝరిలా పరవళ్ళు తొక్కుతూ వస్తోంది... తమ ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టి, నిరాశా నిస్పృహలలో కొట్టుమిట్టాడుతున్న పాపాత్ముల బ్రతుకుల్లో క్షమాసాగరాన్ని చిలికించగ ఏతెంచింది... ఆంతర్యాలపై పేరుకుపోయిన అలసత్వపు తుప్పును గ్రంథ పారాయణం ద్వారా ప్రక్షాళనం చేసి ప్రకాశమానం చేయటానికి అరుదెంచింది.

ఈ బహూపరాల మాసాన్ని తనివితీరా ఆస్వాదించే మహత్తర అవకాశం లభిస్తున్నందుకు మన అణువణువూ పులకించాలి. పరమ ప్రభువుకు మనసారా కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఆ కృతజ్ఞతలకు ప్రతిరూపమే ఈ నెలంతా మనం పాటించే ఉపవాసాలు.

ఉపవాసాల ద్వారా ఆధ్యాత్మిక లాభాలతోపాటు భౌతిక ప్రయోజనాలు కూడా ప్రాప్తమవుతాయి. కాస్త ఆలోచించండి! మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాల సేవనం వంటి రోనికరమైన వ్యసనాలకు బానిసలుగా మారిన వారిలో మార్పుకు ఈ మాసం ఓ సువర్ణావకాశం కల్పిస్తోంది. ప్రతి రోజూ 14 గంటలపాటు అల్లాహ్ ప్రీతి కోసం అన్నింటికీ దూరంగా ఉన్నవారు ఈ దురలవాట్లకు మాత్రం ఎందుకు దూరమవలేరు? సంకల్పబలం ఉంటే ప్రతిదీ సుసాధ్యమే. .....క్షణికావేశానికి లోనై ఆత్మనోతం చేసుకున్నవారికి, పశ్చాత్తాపం చెంది పవిత్ర జీవితం గడపటానికి రమజాన్ ఓ మహదవకాశం ప్రసాదిస్తుంది. నెల రోజుల కఠోర దీక్షతో ఆత్మను నిగ్రహించుకోగలిగినవారు ఏడాదంతా విషయలోలత్వానికి దూరంగా ఎందుకు మసలుకోలేరు? కావలసిందల్లా వజ్ర సంకల్పమే. రమజాన్ ఈ సంకల్ప నిరతినే మనకు ప్రసాదిస్తుంది... అహంకారం, పిసినారితనం, ఆత్మస్తుతి, పరనింద వంటి దుర్గుణాల కారణంగా తమ సత్కర్మలను వ్యర్థం చేసుకునేవారికి ఈ మాసం దిద్దుబాటు చేసుకునే బంగారు అవకాశం ఇస్తోంది. ఉపవాసాల ద్వారా వారిలో అణకువ, ఔదార్యం, ఆత్మ విమర్శన, రుజువర్తన వంటి సద్గుణాలు జనిస్తాయి. అవసరమైనదల్లా చిత్తశుద్ధి, సహృదయత మాత్రమే..... అసహనం, ఆగ్రహం, రెచ్చిపోయే స్వభావం ఉన్నవారిలో రమజాన్ మాసం సహనం, నిగ్రహం, సామరస్యం, మృదుత్వం వంటి సుగుణాలను సృజించగోరుతోంది- అయితే వాటిని పుణికి పుచ్చుకోవాలన్న తపన ఉండాలి.

ఈ రోజు ఒక ఉపవాస వ్రతాన్ని విజయవంతంగా పాటించామ, సరే. కాని ఆ ఉపవాసానికి గొడ్డలిపెట్టుగా ఉన్న వ్యర్థ విషయాలన్నింటి నుండి దాన్ని రక్షించుకున్నామా? ఒక రాత్రంతా జాగారం (ఖియామ్) చేశామ, సరే. కాని ఆ జాగారాన్ని భక్తిశ్రద్ధలతో గడిపామా? లేదా? క్షమాభిక్షకై వేడుకున్నామా? లేదా? అని ఎప్పటికప్పుడు ఆత్మ విమర్శన చేసుకుంటూ ఉండాలి. ఈ సందర్భంగా మన ప్రియ ప్రవక్త (స) వారేమన్నారో చూడండి:

"ఎవడు నిష్కల్మషమైన విశ్వాసంతో, ప్రుణ్యఫలాపేక్షతో రమజాన్ ఉపవాసాలు పాటించాడో అతని గత కాలపు పాపాలన్నీ క్షమించబడతాయి. ఎవడు చిత్తశుద్ధి కలిగిన విశ్వాసంతో, ప్రుణ్యఫలాపేక్షతో రమజానులోనూ, లైలతుల్ ఖద్‌లోనూ ఆరాధనకై నిలబడతాడో అతని వల్ల గతంలో జరిగిన అపరాధాలన్నీ క్షమించబడతాయి".



సహరీ, ఇఫ్తార్

ఎన్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com

ఆరాధన పరిణామం ఆధ్యాత్మిక వికాసం, ఇది సందేహ రహితం. ఆరాధనా భావం స్వచ్ఛంద శారీరక యాతనా అనుభవం. ఇది మూఢత్వం. శారీరక బాధలే దైవ సామీప్యానికి సోపానాలు, దైవ సాయుజ్యానికి అగ్ర పీఠాలు, ఇది అజ్ఞానం. ఇస్లామీయ ఆరాధనా భావనలో దైవాజ్ఞపాలన, దైవ విధేయ తలకే ప్రాధాన్యం. మనిషిలో దైవ దాస్య లక్షణాన్ని పటిష్టతరం చేయటమే ఆరాధనా లక్ష్యం. రోజా వ్రతం కూడా అందుకే. దాసుడు ఉపవాసంలో ఆకలిదప్పుల బాధ వల్ల తపించడం దైవానికి సంతోషకరమయిన, ప్రసన్నతా ప్రదమయిన విషయమా?

ఉపవాసం ఆచరణాత్మకంగా, దాసుని ప్రభువాజ్ఞాపాలనా ప్రదర్శనం, అంతే. ఆయన ఆదేశమయింది – దాసుడు శిరసావహించాడు. ఓ నిర్ణీత సమయం వరకు అన్నపానీయాలను ముగించుకున్నాడు. ఇక తాను దైవాదేశాలకు కట్టుబడి నడుచుకుంటానని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత దైవాజ్ఞల్ని ఉల్లంఘించే ఎన్నెన్ని అవకాశాలు, ఎన్నెన్ని సన్నివేశాలు ఎదురయినా, ఆకలిదప్పులే కాదు, మరే వాంఛలయినాసరే ఎంతగా ఘోష పెట్టినా దైవాజ్ఞల్ని ససేమిరా మీరడు. ఒక్క అన్నం మెతుకు, ఒక్క నీటి చుక్క ముట్టుకోడు. ఒక్క సిగ్గుమాలిన చూపు, ఒక్క నీతి లేని పలుకు, ఒక్క చెప్పనలవికాని పని, ఒక్క చెయ్యనొల్లని మాట, దేవునికి ఒప్పని దిక్కులో ఒక్క అడుగు – ఇక ఈ దాసుని ద్వారా కాని పనులు. దాసుని ఈ విధేయతా భావమే దేవునికి చాలా ఇష్టమయినది.

ఆ తర్వాత, ఆయన ఆదేశం మేరకే అన్నపానీయాలు అనుమతించబడినప్పుడు, ప్రభువాజ్ఞకే నిరీక్షిస్తూ ఉన్నట్లు, ఒక్క క్షణం కూడా జాగు చెయ్యకుండా దాసుడు ఉపవాస విరమణకు ఉపక్రమిస్తాడు. ప్రభువు సంకేతం అవగానే భోజన పానీయాలు విరమించుకుని రోజా పాటించడం మొదలెట్టి దైవ ప్రసన్నతను పొందినట్లే, దేవుని మరో సైగ అందగానే రోజా వ్రతాన్ని విరమించుకుని అన్నపానీయాలు మొదలెట్టడం కూడా దైవ ప్రసన్నతకే కారణమవుతుంది. ఉపవాస వ్రతాన్ని ప్రారంభించే ముందు, దైవాదేశం రీత్యా ఉషోదయానికి పూర్వం పుచ్చుకునేది 'సహరి' అయితే, సూర్యాస్తమయం వెంటనే అదే దైవాదేశాన్ని అనుసరించి చేసే ఉపవాస వ్రత విరమణనే 'ఇఫ్తార్' అంటారు.

ఉపవాస వ్రతాన్ని సహరీతో ప్రారంభించే సంప్రదాయం ఒక ఇస్లాంకే ప్రత్యేకం. అంతిమ దైవ ప్రవక్త మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా బోధించారు:

"సహరీ చెయ్యండి, సహరీ చేయడం శుభకరమయినది".

(బుఖారీ, ముస్లిం)

సహరీ, పగలంతా దైవాజ్ఞాపాలనను గడిపేందుకు ఎంతగానో ఉపకరిస్తుంది. శరీరాన్ని బలహీనపడనివ్వదు; ముప్పూటలా తినమరిగిన శరీరం ఒక్కపూట దొరక్కపోయినా తల్లడిల్లి పోతుంది, ఢీలా పడిపోతుంది. దైవాదేశాల పాలన తృప్తికరంగా జరగదు. అందుకే సహరీ.

మహనీయ ఇర్బాజ్ బిన్ సారియా (ﷺ) తెలిపిన దాని ప్రకారం, ఒకసారి రమజాన్ నెలలో కారుణ్యమూర్తి (ﷺ) నన్ను సహరీ భుజించడానికి ఆహ్వానిస్తూ "రావయ్యా, శుభకరమయిన అల్పాహారానికి" అన్నారు. (అబూ దావూద్, నసాయి)

ఉపవాస వ్రతం పాటించడమంటే దైనందిన కార్యకలాపాలను విరమించుకుని 'అల్లాహ్, అల్లాహ్' అనుకుంటూ మూలన కూర్చోవాలన్నది ఉద్దేశ్యం కాదు. ఉపవాస వ్రతంలో దైవాజ్ఞా పాలనకే ప్రాధాన్యం. రోజువారి పనులకు దాసుడు దూరమవడం, ఉపవాస వ్రతంలో గల అసలు ఉద్దేశానికి విఘాతం. అందుకే సహరీ తప్పక భుజించాలని ఆదర్శమూర్తి (ﷺ) బోధించారు. అప్పుడే దైనందిన కార్యకలాపాలు సజావుగా సాగుతాయి.

మహనీయ అబూ హురైరా (ﷺ) ప్రకారం దైవ సందేశహరులు (ﷺ), "విశ్వాసికి అత్యుత్తమమయిన సహరీ ఖర్జూరప్పండ్లు" అని అన్నారు (అబూ దావూద్). ఖర్జూర ఫలాలు మానవునికి అవసరమయిన ఆహార విలువలు పరిపూర్ణంగా గల పదార్థం. అందుకే దాన్ని బలపరచారు మానవ మహోపకారి (ﷺ).

ఇక ఇఫ్తార్‌లోనూ దైవాజ్ఞాబద్ధత దర్శనమిస్తుంది. పగలంతా తన దినసరి కార్యక్రమాలలో తలమునకలయి ఉండే దాసుడు అనుక్షణం దైవాదేశాల ఉల్లంఘన జరక్కుండా జాగ్రత్త పడుతూ గడుపుతాడు. తన ఉదర వాంఛల్ని, మనో కాంక్షల్ని అదుపులో ఉంచుకుంటాడు. కాని తిరిగి దైవాదేశమయి అనుమతి లభించగానే వ్రత విరమణలో కూడా అగ్రగామిగానే ఉంటాడు. అంటే ఇంతవరకు దైవాజ్ఞే అతన్ని కట్టడి చేసింది. ఇప్పుడూ దైవాదేశమే అతన్ని విడిచి పెట్టిందని చాటుతున్నాడన్న మాట. స్వేచ్ఛగా తన కోర్కెల్ని నెరవేర్చుకుంటున్నాడు. ఇలా తాను దైవ విధేయతలో మున్నుందుగా ఉండే దాసుడని, 'ముస్లిం'నని సాక్ష్యం పలుకుతున్నాడు. ఇదే దైవానికి ఇష్టమయినది. అందుకే మహనీయ సహత్ (ﷺ) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (ﷺ) ఇలా సెలవిచ్చారు:

"ఇఫ్తార్ చేయడంలో ఆలస్యం చేయకుండా త్వరపడే వరకు మనుషులు శుభాన్ని ఆశ్రయించి ఉంటారు". (బుఖారీ, ముస్లిం)

(మిగతాది 19 పేజీలో)

- శాంతి ప్రియ

కర్తవ్యం పిలుస్తోంది... కదలి రండి!

మానవ ప్రురోగమన పోరాటం అనేక రూపాల ఆధారంగా జరిగింది. అజ్ఞానం నుండి, భయం నుండి, దోపిడి నుండి, పెత్తనం నుండి, నియంతృత్వ భావన నుండి, బానిసత్వం నుండి, అణచివేత నుండి విముక్తి పొందడానికి కృషి చేస్తూనే ఉన్నాడు మనిషి. ఈ కార్య సాధన కోసం అసాధారణ త్యాగాలు చేస్తూ వచ్చాడు మనిషి. విశ్వంలోని జనావళిని సమానంగా గౌరవించబడాలని, ఆదరించబడాలని అభిలషించారు మానవోత్తములు. ఆ విధంగా లోకవాసులంతా సమరస భావంతో విరాజిల్లాలని, వారిలో సోదర భావం వెల్లి విరియాలని ఆకాంక్షించారు ఆ ప్రురుషోత్తములు.

ఈ ఆశయ సిద్ధి కారకు ప్రురుషులతోపాటు అప్రూర్వ త్యాగాలు చేసిన ఆడపడుచులు సంఖ్యతం అధిక సంఖ్యలోనే ఉన్నారు. వారిలో కొందరు ఆర్థిక, ఆధ్యాత్మిక, నైతిక పరమైన త్యాగాలకు పేరెన్నికగంటే మరి కొందరు కార్య దీక్షకు, ప్రుశాంత చిత్తానికి ప్రుతీకలయ్యారు. కొందరు అసమాన నాయకత్వ లక్షణాలలో ప్రుసిద్ధి పొందగా, ఇంకా కొందరు ప్రుమశిక్షణకు, ధైర్యసాహసాలకు మచ్చుతునకలయ్యారు.

ఈజిప్టులో ప్రవక్త మూసా (అలైహిస్సలాం) ఫిరౌన్ నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపు ఇచ్చినప్పుడు గాని, పాలస్తీనాలో ప్రవక్త ఈసా (అలైహిస్సలాం) అంధానుసరణకు వ్యతిరేకంగా గళం విప్పినప్పుడు గాని, అరేబియాలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ﷺ) విశ్వ మానవ సోదరభావంతో కూడిన సత్య శంఖాన్ని పూరించినప్పుడుగాని పురుషులతోపాటు స్త్రీలు సయితం సహజంగానే స్పందించారు. తమ వంతు సహాయం అందించారు. నిరుపమాన త్యాగాలూ చేశారు. పురుషుల్లాగే స్త్రీలూ అమరగతి నొందారు. సంఘ బహిష్కరణకు, ఏలికల వైషమ్యానికి బలయ్యారు. ఇలా తమ ధన, మాన, ప్రాణ త్యాగాలతో లోకశాంతి సిద్ధిస్తుందని పురుషులు మాదిరి వారూ కలలు కన్నారు. ఆ కలల్ని నిజం చేసే దిశలో పయనించి పరమోన్నత ప్రభువు సన్నిధికి పయనమయిన పడతులెందరో!

లోకశాంతికి సంబంధించిన గురుతర బాధ్యతలను స్వీకరించడానికి వారు ఏనాడూ వెనుకాడి ఎరుగరు. సమరస భావం సమానత్వం, నీతి, నిజాయితీ, న్యాయం, ధర్మం, కరుణ, దయ, జాలి, ఆప్యాయత, అనురాగం, ప్రేమ, వాత్సల్యం - తౌహీద్ ప్రాతిపదికలపై ఆధునిక సత్సమాజాన్ని నిర్మించాలనే తపనలో అలనాటి సుమతులు, సదయులు అహరహం శ్రమించారు. విశ్వ మానవ కళ్యాణం నిమిత్తం అంటే- వర్గ, వర్ణ, ప్రాంత, భాష, జాతి తర తమ భేదరహిత సమరస సమాజాన్ని వారు ఆకాంక్షించారు. ఈ మహోన్నత లక్ష్య పునాదులు నూహ్ ప్రవక్త నాటి నుండే పాదులు వేసుకున్నాయన్నది గమనార్హం.

కూపస్థ మండూకాల్లా పడివున్న ఇస్రాయీల్ సంతతి ప్రజలు ప్రవక్త మూసా (అలైహిస్సలాం) పిలుపుతో భావ దారిద్ర్యం నుండి తేరుకొని స్వేచ్ఛా ప్రపంచంలోకి ప్రవేశించారు. అప్పటికే వారిపై ఎన్నో ఆంక్షలు ఉండేవి. 70 వేల పసికందుల్ని కోల్పోవాల్సి వచ్చిన నికృష్ట సందర్భం కూడా అదే. అయినా వారు అధైర్య పడలేదు. కరుణ ఆభరణాల్లో సంకల్పాల వజ్రాలు పొదిగి, కూర్మి కవచాలు తొడిగి సమర క్షేత్రంలో సమరస స్ఫూర్తితో దూసుకుపోయారు. స్త్రీలు సయితం సమాజంలోని సగ భాగం గనుక కర్తవ్య పరాయణత పారీణతతో ప్రతి ఒక్క పడతిలో చైతన్యం పెల్లుబికింది. జాతి విముక్తి కోసం పోరాటపటిమను కొన సాగించమని కొండంత ధైర్యాన్నిచ్చి సాగ నంపారు అలనాటి వీర నారీమణులు.

అప్పట్లో త్యాగాలు చేసిన మహిళా లోకంలో ఆసియా బిన్తె ముజాహిమ్‌కు గొప్ప ఖ్యాతియే లభించింది. అప్పటి నిరంకుశ చక్రవర్తి ఫిరౌన్‌కు స్వయాన భార్యగా, ఈజిప్టు దేశానికే మహారాణిగా సకల భోగభాగ్యాలు అనుభవించే వీలు ఉన్నప్పటికీ ఆమె వాటిని ఖాతరు చేయలేదు. తన చేతుల మీదుగా, తన ఒడిలోనే పెరిగి పెద్దయిన మూసా ప్రవక్త సత్య పిలుపుని విని ఉత్తేజితురాలై తన సువర్ణ సౌధాన్ని, అందలి పసిడి ఆభరణాల్ని, వజ్ర వైఢూర్యాలు నిండిన జీవితాన్ని సన్యసించి సత్య పక్షం వహించింది. సత్య ధర్మ పరివ్యాప్తికి స్వయంగా ఫిరౌన్ రాజ భవనంలోనే పాదులు వేసి, అసత్య నిర్మూలనకై అవిరళ కృషి సలిపి త్యాగ ధనురాలయింది. పర్యవసానం చాలా భయంకరంగానే పరిణమించింది. సత్యాన్ని విడనాడమని షైతాన్ స్వభావుడు ఫిరౌన్ ఎంత ఒత్తిడి చేసినా, చివరికి సజీవంగానే శిలువపై వ్రేలాడదీసి అవయవాల్ని ఒక్కొక్కటిగా కోసినా, గుండెల్లో గునపాలు గుచ్చినా , తలలో మేకులు కొట్టినా తొణకక, పట్టు సడలని విశ్వాసంతో ధర్మోన్నతి కోసం **'రబ్బిజ్‌అల్లీ ఇన్‌దక బైతన్ ఫిల్ జన్నహ్'** (ప్రభూ! స్వర్గంలో నా కోసం నీ తరపున ఒక

నిలయాన్ని నిర్మించు) అంటూ తుది శ్వాస విడిచింది. ఆ విధంగా అలనాటి అనువంశిక దౌర్జన్యంపై తన చెర్నాంకోలును ఝళిపించింది. అలా అనితర సాధ్య ధైర్యసాహసాల్ని, మొక్క వోని సహనాన్ని పదర్శించిన ఆ మహిళా మూర్తిని సత్య దేవుడైన అల్లాహ్ ప్రశంసిస్తూ మానవ జాతి మనుగడకు మణి కుసుమంగా పేర్కొన్నాడు:

"మరి అల్లాహ్ విశ్వాసుల కొరకు ఫిరౌను భార్యను ఆదర్శంగా పేర్కొంటు న్నాడు. అప్పుడామె ఇలా వేడుకున్నది: 'నా ప్రభూ! నా కోసం నీ దగ్గర - స్వర్గంలో - ఒక గృహాన్ని నిర్మించు. నన్ను ఫిరౌను నుండి, అతని దాష్టికా న్నుండి రక్షించు. దుర్మార్గ జనుల నుండి నాకు విముక్తిని ప్రసాదించు".

(తహ్రీమ్: 11)

అదే రాజ మహలులోని పని మనిషి కూడా తక్కువేమీ కాదు. ఫిరౌన్ రాజ భవనంలో స్వయాన అతని ముద్దుల కూతురికి సేవకురాలిగా పని చేసే విశ్వాస మహిళ ఆమె. స్వేచ్ఛా పిపాసతో రగిలిపోయిన, సత్య జ్యోతి ప్రభావంతో వెలిగిపోయిన అబలగా భావించబడే సబల ఆ స్త్రీ మూర్తి. **'అన రబ్బుకు ముల్ ఆలా'** అన్న ఫిరౌన్ దురహంకార గర్జనతో స్తబ్ధత ఆవరించిన ఆ సమాజంలో సత్యాగ్ని కణాన్ని రాజేసిన ఆ మాతృమూర్తి విశ్వాసం శక్తివంత మైనది. అసలే బానిసరాలు. ఆపై అబలయి కూడా ఆమె ప్రదర్శించిన సాహసం, సమయస్ఫూర్తి సాటి లేనిది. ఫిరౌన్ రాజభవనంలో సత్య శంఖం పూరించింది. ఆమె సత్య ప్రచార శైలికి ముగ్ధురాలయి 'ఆసియా బిన్తె ముజా హిమ్' ఇస్లాం స్వీకరించింది. ఇది తెలుసుకున్న ఫిరౌన్ ఆమె నలుగురు బిడ్డల్ని సలసలకాగే నూనెలో పడేసి వేయించేశాడు. ఆ నలుగురిలో ఒకడు పాలు త్రాగే పసికందు కూడా ఉన్నాడు.

అయినా ఆమె తొణకలేదు సరికదా "నన్ను సయితం ఈ నూనెకి ఆహుతి చేశాక మా అందరి ఎముకల్ని ఒకే చోట సమాధి చెయ్యండి. రేపు ప్రళయ దినాన **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** సద్వచనం పలుకుతూ మేమంతా సమాధి నుండి లేస్తాము' అని ఘంటాపథంగా ప్రకటిం చింది. ఆమె చూపిన ధైర్యసాహసాల్ని మెచ్చుకుంటూ మేరాజ్ సందర్భంగా ఏడు ఆకాశాలపైన దైవ దూతల నాయకుడు జిబ్రయీల్ ద్వారా ప్రవక్తలందరి నాయకుడైన అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (ﷺ) వారికి ఆమె దృష్టాం తాన్ని విన్పించాడు దేవుడు. అట్టి 'సత్య బాంధవి' అయిన ఆ వీర వనిత చరిత్రలో చిరస్మరణీయురాలయింది.

ఆ పరంపరలో పరమ పవిత్రమైన పుణ్యస్త్రీ అయిన జైనబ్ (رضي الله عنها)నూ విస్మరిం చలేము. ఆమె మహా నిరాడంబర జీవి. సిగ్గు సిరులే ఆమె ఆభరణాలు. నిస్వార్థ సేవే ఆమె స్వరూపం. సాత్విక ప్రేమానురాగాలే ఆమె నైజం. అనాథ బాలలు, వితంతువులు, నిరుపేదలు అభాగ్యజీవులే ఆమె అనుదిగు సంతానం. ప్రజా సేవే ఆమె ఊపిరి. సంస్కరణా భిలాషే ఆమె మూల ధనం. సత్య ధర్మోన్నతియే ఆమె ప్రాణం. ఆ సత్య వ్యవస్థపై ఆమెకు ఎనలేని అభిమానం. మక్కా మదీనాల్లోని నిరుపేదలతోనే గడిపేది. దీన జనంపై తప్ప మరి దేని పైనా ఆమెకు మమకారం లేదు. వారి క్షేమం కోసమే అహరహం శ్రమించేది. వారి ధ్యాసలోనే ఆమె అసువులు బాసింది. ఇటు ప్రజా సేవ, అటు దైవ సేవలో సమతౌల్యంతో జీవితాన్ని సార్థకం చేసుకుని 'ఉమ్ముల్ మసాకీన్' అన్న ప్రశంస స్వయానా ప్రవక్త (ﷺ) నోట పొందిన ధన్యజీవి విశ్వాసుల మాత హజ్రత్ జైనబ్ (رضي الله عنها)

ఆ విషయానికొస్తే - సత్యోద్యమంలో, విద్యార్జనలో, ప్రవక్త (ﷺ) వారి ప్రవచ నాల్ని ప్రజలకు ప్రబోధించడంలో హజ్రత్ ఆయిషా (رضي الله عنها) మహా ధీరోదాత్త. దాదాపు "2210" హదీసలను ఉల్లేఖించిన ఘనత స్త్రీలలో ఆమె ఒక్కరికే దక్కింది. ప్రవక్త (ﷺ) వారి సత్య సూక్తులకు, పరలోక మోక్ష సిద్ధాంతాలకు ప్రభావితురాలయిన ఆమె తర్వాతి కాలంలో 'జమల్ రణ రంగం'లో పాల్గొన్నారు. అప్పట్లో ధార్మిక ఫత్వాలు జారీ చేసిన ధర్మ పండితురాలు. అనేక మంది సహాబాలు ఆమె వద్ద శిష్యరికం పొంది ధార్మిక విద్యార్జన చేసేవారు. ఇలా చెప్పుకుంటూపోతే ఈ పరంపరలో హజ్రత్ మర్యమ్ (عليها السلام), హజ్రత్ ఖదీజా (رضي الله عنها), హజ్రత్ ఫాతిమా (رضي الله عنها), హజ్రత్ అస్మా (رضي الله عنها), హజ్రత్ ఉమ్మె సలమా (رضي الله عنها), హజ్రత్ ఉమ్మె తలహా (رضي الله عنها) లాంటి వారెందరో ఉన్నారు. వీరంతా 'ప్రకృతి ధర్మం' నుండి ప్రేరణ పొందిన నారీమణులే. ఇస్లాం మెచ్చిన వనితలే.

కాలంతోపాటే విలువలు కూడా మారినాయి. అన్ని రంగాలలోనూ కల కంఠి ముందంజ వేస్తున్నప్పటికీ ఆమె కంట వొలికే కన్నీళ్ళు మాత్రం తగ్గటం లేదు. కారణం ఆధునిక దోపిడీ! నవ నాగరికత పేరిట జరిగే ఎక్స్‌ప్లాయిటేషన్!! సబ్బు బిళ్ళ మొదలుకుని షేవింగ్ బ్లేడు అమ్మకం వరకు ప్రతి దానికీ మానవీమణి సిగ్గు సిరిని అంగడీలో ప్రదర్శించే మగ మారాజు స్వార్థానికి 'ఆమె' అవలీలగా బలైపోతున్నది. తల్లి కడుపులో ప్రాణం పోసుకుంటోందని తెలిసిన క్షణం నుంచే 'భ్రూణ హత్య' ఆలోచనతో మొదలయ్యే ఈ ఎక్స్‌ప్లాయిటేషన్ ఆమె జీవితంలోని అన్ని దశలలోనూ జరుగుతున్నది. దానికి బదులు మానవ మనుగడలో ఆమె 'సగమ'ని, సగాలు రెండూ ఒకటైతేనే గాని జగానికి ఓ నిండుదనం రాదని గ్రహించే సహృద యత పెంపొందాలి. కోమలాంగికి ఆమె కార్య క్షేత్రంలో నిరాటంకంగా పురోగ మించే వ్యవస్థను ఏర్పరచాలి. అదే మహిళాభ్యుదయం. అదే మహిళాభి రామం!!

మన భారత రాజ్యాంగం ప్రకారం స్త్రీ పురుషులు సమానులని 1950లో చట్టం అమల్లోకి వచ్చినా అది కాస్తా పురుషా హంకార చుట్టమై కూర్చుంది. 1961లో వరకట్న నిషేధం చట్టం వచ్చినా, 1956లో వితంతు వివాహాలకు వీలు కల్పిస్తూ శాసనం పుట్టినా, సుమారు 200 సం నాడు సతి సహగమన వ్యతిరేక చట్టం అమల్లో వచ్చినా ఇంకా స్త్రీలపై అనేక విధాల అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి.

(మిగతాది 17వ పేజీలో)

మూలం:
షేఖ్ ఆయిద్ అబ్దుల్లాహ్ అల్ ఖర్నీ

ఔదార్యాన్ని, త్యాగ నిరతిని నేర్పే శిక్షణా కాలం

ప్రభువైన అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "మీరు మీ కోసం ఏ మంచిని (పుణ్య కార్యాన్ని) ముందుగా పంపినా, దాన్ని అల్లాహ్ దగ్గర అత్యుత్తమ రూపంలో అత్యధికంగా పొందుతారు". (ఖుర్‌ఆన్- 73: 20)

ఆయన ఇంకా ఇలా అంటున్నాడు: "అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చు చేసేవారి ఉపమానం ఇలా ఉంటుంది: ఒక విత్తనాన్ని నాటగా, అది మొలకెత్తి అందులో నుంచి ఏడు వెన్నులు పుట్టుకు వస్తాయి. ప్రతి వెన్నులోనూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరినవారికి సమృద్ధి వొసగుతాడు. అల్లాహ్ పుష్కలంగా ప్రసాదించేవాడు, ప్రతిదీ తెలిసినవాడు". (ఖుర్‌ఆన్- 2: 261)

ఒక ప్రామాణికమైన హదీసులో ఇబ్నె అబ్బాస్ (రదియల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (ﷺ) సహజంగానే ప్రజలందరిలోకెల్లా ఎక్కువ దానశీలురు. అయితే రమజాన్ నెలలో జిబ్రయీల్ దూతను కలిసినప్పుడు ఆయన ఇంకా ఎక్కువ ఔదార్యం కనబర్చేవారు. నిజం చెప్పాలంటే ఆ సమయంలో ఆయన ఔదార్యం ప్రభంజనం కంటే వేగంగా ఉంటుంది. ఆకలిగొన్న వారికి అన్నం పెట్టమని, అవసరాల్లో ఉన్నవారిని ఆదుకోమని, నిరుపేదలకు చేయూతనివ్వమని ఉపవాసం ప్రోత్సహిస్తుంది. రమజాన్ మాసం దైవమార్గంలో ఖర్చు చేసే వారి కాలం. త్యాగం చేయాలని, పరులకు ఎంతోకొంత ఇవ్వాలని ఉవ్విళ్ళూరే సదాచార సంపన్నులకు రమజాన్ మాసం ఓ సువర్ణావకాశం. అల్లాహ్ మీకేదైనా ప్రసాదించి ఉంటే అందులో కొద్దిగా నిరుపేదల కోసం త్యాగం చేయండి. ధనం నీరు లాంటిది. నీరు ప్రవహిస్తూ ఉంటే తియ్యగా, తాజాగా ఉంటుంది, దాని ప్రవాహాన్ని అడ్డుకున్నట్లయితే అది మురిగి, కలుషితమయి విషంగా మారిపోతుంది.

త్యాగం ఎంత గొప్పది! దానం ఎంత మహోన్నతమైనది! ఔదార్యం ఎంత సుందరమైనది! "ప్రతి రోజూ ఇద్దరు దైవ దూతలు దివి నుండి దిగి వస్తారు. వారిలో ఒక దూత, 'అల్లాహ్! ఖర్చు పెట్టేవాడికి ప్రతిఫలాన్ని ప్రసాదించు' అని ప్రార్థిస్తే, రెండో దూత, 'అల్లాహ్! కూడబెట్టుకునే వాడి సంపదను నాశనం చెయ్యి' అని ప్రార్థిస్తూ ఉంటాడ"ని దైవప్రవక్త (ﷺ) ప్రబోధించారు.



ఆ విధంగా అల్లాహ్ దాసులు ఎవరైనా ఆయన మార్గంలో ఎంతో కొంత ధనం ఖర్చు చేసినప్పుడు దాని మూలంగా అల్లాహ్ వారి భౌతిక, ఆధ్యాత్మిక, మానసిక స్థితిగతుల్లో సౌలభ్యాన్ని సమకూరుస్తాడు. అతని జీవనావసరాలకు సరిపోయే వస్తువుల్లో వృద్ధిని ప్రసాదిస్తాడు. "నీరు మంటను ఆర్పేసినట్లే, దానధర్మాలు రాబోయే ఆపదలను తప్పిస్తాయి" అని దైవప్రవక్త (ﷺ) ప్రవచించి ఉన్నారు. చెడు పనులు మనసుల్లో మంటను రాజేస్తాయి. ఆత్మల్లో వేడిని రగిలిస్తాయి. జీవితాన్ని నిప్పుల కుంపటిగా మార్చేస్తాయి. ఒక్క దానధర్మాలు మాత్రమే ఆ అగ్ని జ్వాలల్ని చల్లార్చగలవు. దానం మనో వేడిని చల్లబరుస్తుంది. ఆత్మలో పరిమళాన్ని గుభాళింపజేస్తుంది. ప్రతి చెడు కార్యాన్ని పరిపూర్ణమైన రీతిలో తొలగిస్తుంది.

"మనిషి ప్రాపంచిక జీవితంలో చేసి వెళ్లిన దానధర్మాలు పరలోకంలో అతనికి నీడ కల్పిస్తాయి. ఆ రోజు మానవులకు సంబంధించిన పరస్పర సమస్యలన్నీ తెమలేదాక అతను ఆ నీడ పట్టునే ఉంటాడు" అని ప్రవక్త (ﷺ) ప్రబోధించారు. దాన ధర్మాలు విశాలమైన నీడను కలిగి ఉండటం, ఆ నీడలో మనుషులు ప్రతిఫల దినాన సేద తీరటం, ఆ నీడ ఇహలోకంలో ఆచరించిన దానధర్మాలకు తగ్గట్టు అద్భుతంగా ఉండటం, వింటుంటేనే ఎంతో ఆశ్చర్యంగా ఉంది కదూ?!


రుజువర్తనులైన మన మూడవ ఖలీఫా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రదియల్లాహు అన్హు) గొప్ప ధనవంతులు. ఆ కాలంలో ముస్లింలు 'తబూక్'

అనే ప్రాంతంలో ఓ మహా సంగ్రామం చేయవలసి వచ్చింది. ఆ సమయంలో ముస్లింలకు యుద్ధ సామగ్రి, ఇతర ఆయుధ పరికరాలు అవసరమయ్యాయి. కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం తన సంపదను, ఆస్తులన్నింటినీ ఖర్చుపెట్టి ముస్లిం సేవకులకు కావలసిన యుద్ధ సరంజామా అంతా ఆయన సమకూర్చారు. ప్రత్యేకంగా ముస్లింల కోసం ఆ కాలంలో మొత్తం ఒక బావినే కొనేశారాయన. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ మరో గొప్ప ధనవంతులైన సహాబీ (దైవ ప్రవక్త సహచరులు). అల్లాహ్ ప్రసన్నత కోసం ఆయన ఒకసారి, 700 ఒంటెలపై మోపబడి ఉన్న తన వ్యాపార సామగ్రి మొత్తం మదీనా నగరంలోని పేద ప్రజలకు పంచి పెట్టారు.

- ఒక చిన్న రొట్టె ముక్కకూ, చుక్క పాలకూ, పట్టెడన్నానికీ నోచుకోకుండా పస్తులు గడుపుతూ ఉపవాసాలు పాటిస్తున్న అభాగ్య జీవులెందరో మన సమాజంలో బతుకు బండి లాగుతున్నారు.
- తల దాచుకోవటానికి ఇల్లులేక, ఒక చోట నుంచి మరో చోటుకు వెళ్ళటానికి కనీస వాహన వసతుల్లేక, కష్ట కాలంలో తమను ఆదుకునే స్నేహితులూ లేక సతమతమవుతున్న ఎంతో మంది దీనులూ మన చుట్టు ప్రక్కల్లో ఉపవాసం పాటిస్తున్నారు.
- తినేందుకు ఏమీ లేక పస్తులతోనే ఉపవాసం ప్రారంభించి, తిరిగి ఉపవాస విరమణ (ఇఫ్తార్) సమయంలోనూ గుక్కెడు మంచి నీళ్ళతో సరిపెట్టుకుని పస్తుల్ని కొనసాగించే కష్టజీవులకూ మన సమాజంలో కొదువ లేదు.

బహుశా ఇలాంటివారిని దృష్టిలో పెట్టుకుని దైవప్రవక్త (ﷺ), "ఎవరయినా ఒక ఉపవాసి ఉపవాసాన్ని విరమింపజేస్తే (అంటే ఇఫ్తార్ చేయిస్తే) ఆ ఉపవాసికి లభించినంత పుణ్యం అతనికీ లభిస్తుంది. అలా అని ఆ ఉపవాసి పుణ్యంలోనూ ఎలాంటి కోతా విధించబడదు" అని వక్కాణించారు. ఈ కారణంగానే సదాచార సంపన్నుల ఔదార్యం శుభప్రదమైన రమజాన్ మాసంలో అనూహ్యంగా పెరిగిపోతుంది. ఈ మాసంలో వారు దైవ మార్గంలో అమితంగా ధనం ఖర్చు పెడతారు. ఎముక లేని చేత్తో దానధర్మాలు చేస్తారు. అసాధారణ త్యాగ భావాన్ని కనబరుస్తారు. వారిలో చాలా మంది నిరుపేదలకు అన్నదానం చేస్తారు. రమజాన్ నెలలో ప్రతి రోజూ ఉపవాసకులకు "ఇఫ్తార్" (ఉపవాస విరమణ) చేయిస్తారు, అలా చేసి వారు విశ్వ ప్రభువైన అల్లాహ్ నుంచి గొప్ప పుణ్యాన్ని, మహోన్నతమైన ప్రతిఫలాన్ని అందుకుంటారు.

సదాచార సంపన్నులైన మన పూర్వీకుల కాలంలో మస్జిదులు ఎల్లప్పుడూ పేదల కొరకు సమకూర్చబడిన ఆహార పదార్థాలతో నిండుగా ఉండేవి. మస్జిదులలో భోజన సదుపాయాలు కలిగించి అన్నార్తులు, అవసరార్థులు ఒక్కరు కూడా లేకుండేటట్లు



చేసేవారు మన పూర్వీకులు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అల్లాహ్ దాసులు తమ తోటి నిరుపేదలకు అన్నపానీయాలతో సత్కరించినా, వస్త్రదానంతో గౌరవించినా అందులో తమకు అల్లాహ్ ప్రసన్నతా ఉద్దేశం లేకపోతే దానివల్ల ఎలాంటి పుణ్యమూ రాదు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

"మీరు గనక అల్లాహ్‌కు మంచి రుణం ఇస్తే (అంటే అల్లాహ్ మార్గంలో ఖర్చు పెడితే) దాన్ని ఆయన మీ కొరకు పెంచుతూ పోతాడు. మీ పాపాలను కూడా క్షమిస్తాడు. అల్లాహ్ (తన దాసుల సేవలను) గుర్తించేవారు, సహనశీలుడు."

(ఖుర్ఆన్- 64: 17)

ఓ ఉపవాసీ! ఈ రోజు నువ్వు చేసే త్యాగం, నువ్వు ఇచ్చే దానం రేపు నువ్వు పేదరికంలో, అవసరంలో ఉన్నప్పుడు నీకు పనికి రావటానికి నీ ప్రభువుకు ఇచ్చుకుంటున్న రుణమేనని గ్రహించు. ఆ రేపు మరేదో కాదు, ప్రతిఫల దినమే. మనిషి చేతిలో చిల్లి గవ్వ కూడా ఉండని రోజు. ఓ ఉపవాసీ! దప్పిక గొన్న వానికి ఈ రోజు నువ్వు త్రాపించే గుక్కెడు నీళ్లు, శ్రమ జీవి గుండె చల్లదనం కోసం నువ్వు పోసే కాసిన్ని పాలు, ఆకలిగొన్న వానికి నువ్వు పెట్టే పట్టెడన్నం, అవసరంతో సతమతమవుతున్న మనిషికి నువ్వు చేసే కొద్దిపాటి ఆర్థిక సహాయం, బట్టలు లేని బీద ప్రజలకు నువ్విచ్చే వస్త్రదానం - ఇవన్నీ నీ స్వర్గారోహణకు సోపానాలని నువ్వు తెలుసుకోవాలి.

ఓ ఉపవాసీ! అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. దానం కన్నా ఎక్కువగా మరే వస్తువూ సంపదను పరిశుద్ధ పర్చదు. ఎంతో మంది ధనవంతులు అంతులేని తమ సిరిసంపదలను, నిధులు నిక్షేపాలను, ఎత్తయిన భవనాలను, మేడలను మిద్దెలను ఎలా సంపాదించారో అలాగే ఈ లోకంలో వదిలిపెట్టి చనిపోయారు. కాని తాము జీవించి ఉన్నప్పుడు వారు వాటిని అల్లాహ్ మార్గంలో ఉపయోగించకపోవటం మూలంగా వారి తదనంతరం కూడా ఆ సంపద వారి పాలిట దుఃఖానికి, సంతాపానికి కారణమయింది. రేపు ప్రళయ దినాన విజేతలెవరో, ఓటమి పాలయ్యేదెవరో నువ్వే చూస్తావు! సహాయం లభించేది మాత్రం అల్లాహ్ తరఫు నుంచే సుమా!

ముహమ్మద్ అన్వర్ ముహమ్మద్ ఖాసిమ్ సలఫీ

మహా ప్రవక్త (ﷺ) వారి మహితోక్తులు (హదీసులు) దివ్య ఖుర్‌ఆన్‌కు తాత్పర్యం వంటివి, విశదీకరణ లాంటివి. హదీసులను ఉపేక్షించి ఖుర్‌ఆన్ సందేశాన్ని అవగాహన చేసుకోగలమని అనటం అర్థరహితం. అసంభవం కూడా. సృష్టికర్త అవతరింపజేసిన అంతిమ దైవగ్రంథంతో పాటు, అంతిమ దైవప్రవక్త (ﷺ) వారి హదీసులు కూడా నేడు ప్రపంచంలో సురక్షితంగా, యథాతథంగా ఉన్నాయి. ఈ సౌభాగ్యం పొందినందుకు ముస్లిం సముదాయం ఒకింత గర్వపడాలి. ప్రియ ప్రవక్త (ﷺ) నోట జాలువారిన ఒక్కో మహితోక్తిని ఎంతో జాగ్రత్తగా, మరెంతో నిజాయితీగా - ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా - గ్రంథస్థం చేసి మన వరకూ చేర్చిన మహనీయ హదీసువేత్తల అణువణువుకూ స్వర్గ సౌఖ్యాలను ఆస్వాదించే భాగ్యాన్ని అల్లాహ్ ప్రసాదించుగాక! మీ ముందున్న ఈ వ్యాసంలో ఆ హదీసువేత్తలు సంకలనం చేసిన ఉద్గ్రంథాల గురించి సంక్షిప్తంగా పరిచయం చేయటం జరిగింది.

సహీహ్ బుఖారీ

ప్రామాణిక హదీసుల సంకలనాలలో సాటిలేని మేటి గ్రంథం సహీహ్ బుఖారీ. 'సహీహ్' అంటే అత్యంత ప్రామాణికమైనది, ఖచ్చితమైనది, తిరుగులేనిది అని అర్థం. హదీసు విద్యలో నిష్ణాతులైన ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బుఖారీ - రహ్మ.లై - (జననం: హి.శ. 194 - మరణం: హి.శ. 256) అపూర్వ కృషి ఫలితమే ఈ 'సహీహ్ బుఖారీ'. దివ్య ఖుర్‌ఆన్ తర్వాత భూమండలంలో అత్యంత ప్రామాణికమైన, నిజమైన గ్రంథ మేదైనా ఉందంటే అది 'సహీహ్ బుఖారీ' మాత్రమే నన్న విషయంతో హదీసు వేత్తలు, పండితులు, ఇమాములంతా ఏకీభవిస్తారు. అసలిలాంటి ఒక గ్రంథాన్ని సంకలనం చేయాలన్న ఆలోచన ఇమామ్ బుఖారీ (రహ్మ.అలైహి.) గారికి ఎందు కొచ్చింది? దీని గురించి ముహమ్మద్ బిన్ సులైమాన్ బిన్ ఫారిస్ ఇలా అంటున్నారు - ఇమామ్ బుఖారీ (రహ్మ.అలైహి.) చెబుతూ ఉండగా నేను విన్నాను: "ఒక రోజు రాత్రి నేను మహా ప్రవక్త (స)ను కలలో చూశాను. ఆయన (ﷺ) ఒక సదనంతో ఆసీనులై ఉన్నారు. నా చేతిలో విసనకర్ర ఉంది. దాంతో నేను విసురుతూ ఆయన (ﷺ) ముఖారవిందంపై వాలే ఈగలను తోలుతున్నాను. తెల్లవారాక నేను ఈ కల భావార్థం గురించి నిపుణులను సంప్రదించాను. దైవప్రవక్త (ﷺ) వైపు ఆపాదించబడే కట్టు కథలను, కాల్పనిక హదీసులను తొలగించే మహా కార్యం నీ వల్ల జరిగే అవకాశముందని వారు నాకు శుభవార్త విన్పించారు. నిజమైన, ప్రామాణికమైన హదీసులను సంకలనం చేసే గొప్ప కార్యానికి పూనుకోవాలన్న ఆలోచన ఆనాడే నాలో మొగ్గ తొడిగింది.

అంతే. పదహారేళ్ళ కఠోర పరిశ్రమ తర్వాత 'సహీహ్ బుఖారీ' పేరుతో ఓ అపురూపమైన హదీసు గ్రంథం రూపు దిద్దుకుంది. (సహీహ్ బుఖారీ వ్యాఖ్యాన గ్రంథమైన 'ఫత్హుల్ బారీ'లో వ్యాఖ్యాత హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.అలైహి.) వ్రాసిన పీఠిక ఆధారంగా)

ఆ రోజులల్లోనే ఆయన గురువర్యులైన ఇమామ్ ఇస్‌హాఖ్ (రహ్మ.అలైహి.) ఆయనతో మాట్లాడుతూ, 'దైవదాసుల్లో ఏ ఒక్కడైనా ముందుకు వచ్చి కేవలం అత్యంత ప్రామాణికమైన హదీసుల కూర్పు చేసి నట్లయితే ఎంత బాగుండేది!' అని తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ మాట ఇమామ్ బుఖారీ (రహ్మ.అలైహి.) గారి మనసులో గట్టిగా నాటుకుపోయింది. గురువు అభిలాషకు క్రియాత్మక రూపమిస్తూ ఇమామ్ బుఖారీ తన గ్రంథంలోని 6 లక్షల హదీసుల్లోంచి అత్యంత ప్రామాణికమైన హదీసులను మాత్రమే ఎంపిక చేశారు. ఆయన స్వయంగా ఇలా అన్నారు: "నేనీ తుది సంకలనంలో కేవలం ప్రామాణిక హదీసులనే తీసుకున్నాను. సుదీర్ఘ పరంపర ఉందన్న భావంతో ఎన్నో హదీసులను వదలి వేశాను". (తారీఖె బుగ్దాద్: 9/2)

"స్నానం చేసి, రెండు రకాతుల (నఫిల్) నమాజ్ చేసుకోనంతవరకూ నేను ఏ ఒక్క హదీసునూ ఈ పుస్తకంలో పొందుపరచ లేద"ని ఇమామ్ బుఖారీ (రహ్మ.అలైహి.) చెబుతుండగా తాను విన్నానని ముహమ్మద్ బిన్ యూసుఫ్ ఫర్బరీ అనేవారు.

సహీహ్ బుఖారీలోని ఉల్లేఖనాలన్నీ ప్రమాణబద్ధమైనవే. ఇందులో ఏ ఒక్క బలహీన హదీసుగానీ, కాల్పనిక ఉల్లేఖనం గానీ లేదు. ఈ సంకలనంలో మొత్తం 7275 హదీసులున్నాయి.

సహీహ్ ముస్లిం

ఇది ఇమామ్ అబుల్ హుసైన్ ముస్లిం బిన్ హిజాజ్ నీసాపూరి (జననం: హి.శ. 206 - మరణం: హి.శ. 261) గారి లలిత లావణ్య సంకలనం. ప్రామాణికత రీత్యా ఈ గ్రంథం సహీహ్ బుఖారీ తరువాత స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ గ్రంథంలో నమోదై ఉన్న హదీసులన్నీ ప్రామాణికమైనవే. ఉల్లేఖకులను పరికించి, విశ్లేషించే విషయంలో 'ముస్లిం' కన్నా 'బుఖారీయే' మిన్న అని పండితులంటారు. అయితే విషయాను క్రమం ప్రకారం హదీసులను క్రోడీకరించ టంలో ఇమామ్ ముస్లిందే పైచేయి అని వారంతా కితాబు ఇచ్చారు. సహీహ్ బుఖారీ మాదిరిగానే 'సహీహ్ ముస్లిం'లో కూడా సరిగ్గా 7275 హదీసులున్నాయి.

ఒకవేళ ఏదేని ఉల్లేఖనంపై బుఖారీ, ముస్లింలు ఉభయులూ ఏకీభవించి, దానికి ఇరువురూ తమ సంకలన గ్రంథాలలో చోటిచ్చి ఉంటే అట్టి హదీసుకు ఇక తిరుగు లేదన్న మాటే. ఇలాంటి "ఉభయేకీభవిత" ఉల్లేఖనాలనే **'ముత్తఫఖున్ అలైహి'** లేదా **'అఖ్రిజహుష్ షైఖాన్'**గా వ్యవహరిస్తారు. హదీసువేత్తల



"స్నానం చేసి, రెండు రకాతుల (నఫిల్) నమాజ్ చేసుకోనంత వరకూ నేను ఏ ఒక్క హదీసునూ ఈ పుస్తకంలో పొందుపరచ లేద"ని ఇమామ్‌బుఖారీ (రహ్మ.అల్లైహి.) చెబుతుండ గా తాను విన్నానని ముహమ్మద్ బిన్ యూసుఫ్ ఫర్‌బరీ అనేవారు.

పరిభాషలో **'సైఖాన్'** అనగానే ఇమామ్ బుఖారీ, ఇమామ్ ముస్లింలు స్ఫురిస్తారు. ఆ విధంగా ఉభయ గ్రంథాలలోనూ నమోదై ఉన్న హదీసులను అల్లామా ముహమ్మద్ ఫవ్వాద్ అబ్దుల్ బాఖీ (రహ్మ.అల్లైహి.) సంగ్రహించి "అల్లూలూ వల్ మర్జాన్" అనే పేరుతో పుస్తక రూపం ఇచ్చారు. (ఈ పుస్తకం తెలుగులో 'మహా ప్రవక్త (ﷺ) మహితోక్తులు' పేరుతో ప్రాచుర్యంలో ఉంది).

ఇక "సిహా సిత్తా" (షడ్గ్రిజాలు) అంటే ఆరుగురు విశ్వ విఖ్యాత హదీసు ఇమాములు సేకరించిన ఆరు ప్రామాణిక హదీసు గ్రంథాలు. అవి వరుసగా ఇవి.

1- సహీహ్ బుఖారీ
2- సహీహ్ ముస్లిం

(ఈ రెండు గ్రంథాలలోని హదీసులన్నీ ప్రమాణబద్ధమైనవి. వీటిలో ఏ ఒక్కటీ బలహీనం (జయీఫ్)గానీ, కాల్పనికం (మౌజూ)గానీ కాదు.

3- తిర్మిజీ
4- అబూ దావూద్
5- నసాయీ
6- ఇబ్ను మాజా

పై నాలుగు హదీసు గ్రంథాలలో ప్రామాణిక హదీసులతోపాటు కొన్ని బలహీన, కాల్పనిక ఉల్లేఖనాలు కూడా గ్రంథస్థమై ఉన్నప్పటికీ అధికాంశం ప్రామాణికమే అవటం చేత అవన్నీ కూడా 'సిహా సిత్తా' (ఆరు ప్రామాణిక సంకలనాలు)గా ప్రసిద్ధి చెంచాయి.

సునన్ తిర్మిజీ

ఇది ఇమామ్ అబూ ఈసా ముహమ్మద్ బిన్ సూరతు తిర్మిజీ (జననం: హి.శ. 200 మరణం: హి.శ. 279)చే విరచితమైన మరో హదీసు గ్రంథం. ఇందులో మొత్తం 3963 హదీసు లున్నాయి. వీటిలో 80 శాతం కన్నా ఎక్కువ హదీసులు ప్రామాణికమైనవే - అంటే ప్రామాణిక ఉల్లేఖనాల సంఖ్య 3402. బలహీన (జయీఫ్) ఉల్లేఖనాలు 815 ఉండగా, 17 కాల్పనిక హదీసులు కూడా చోటు చేసుకున్నాయి. ఇమామ్ తిర్మిజీ (రహ్మ.అల్లైహి.) ప్రత్యేకత ఏమిటంటే, ఆయన ప్రామాణిక హదీసులతోపాటు హసన్, జయీఫ్ కోవకు చెందిన హదీసులను కూడా సంకలనం చేసిన ప్పటికీ ప్రతి హదీసు యొక్క 'స్థాయి'ని విశదీకరించారు. ఒక హదీసు ఎందుచేత బలహీనం (జయీఫ్) అన బడిందో కూడా వివరించారు. అంతే కాదు, దానికి సంబంధించి ప్రవక్త సహచరుల (ﷺ), తాబయీల, ఇమాముల, ధర్మవేత్తల, షరీయతు నిపుణుల వ్యాఖ్యానాలను, తీర్పులను కూడా ఉటంకించారు.

సునన్ అబూ దావూద్

ఇమామ్ అబూ దావూద్ సులైమాన్ బిన్ అష్‌ఆత్ అల్ సిజ్‌తానీ (జననం: హి.శ. 202 మరణం: హి.శ. 275)చే సంకలనం చేయబడిన గ్రంథమిది. ధర్మ శాస్త్రానికి, చట్టాలు, శిక్షాస్మృతికి సంబం ధించిన ఎన్నో అంశాలకు మాతృక వంటిది ఈ గ్రంథం. ఇందులో మొత్తం 5182 హదీసులున్నాయి. వీటిలో ప్రామాణిక హదీసులు 4147. బలహీన ఉల్లేఖనాలు 1125, కాల్పనిక ఉల్లేఖనాలు 2. మొత్తానికి 78 శాతం కన్నా ఎక్కువ హదీసులు ప్రామాణికమైనవే.

సునన్ నసాయీ

ఇది ఇమామ్ అబూ అబ్దుర్రహ్మాన్ అహ్మద్ బిన్ షుఐబ్ నసాయీచే విరచితం. ఇందులో మొత్తం 5658 హదీసులుండగా, వాటిలో 92 శాతం హదీసులు ప్రామాణికమైనవే. అంటే ప్రామాణికమైన ఉల్లేఖనాలు 5296 ఉండగా, బలహీన ఉల్లేఖనాలు 447 వరకూ ఉన్నాయి. ఈ గ్రంథంలో కాల్పనిక ఉల్లేఖనం అనదగ్గదేదీ లేదు.

(మిగతాది 20వ పేజీలో)

ధర్మ సందేహాలు

ఎడారిలో పని చేసే కార్మికులపై కూడా సామూహిక నమాజు అనివార్యమేనా?



ప్రశ్న: నేను ఒక ఎడారి ప్రదేశంలో పని చేస్తున్నాను. అక్కడి నుంచి మస్జిద్‌కు వెళ్ళాలంటే 25 కి.మీ ప్రయాణించాలి. అందుకే నేను ఐదు పూటలు నమాజులు ఇంట్లోనే చేసుకుంటున్నాను. ఇది అభ్యంతరకరమా?

(ఒక సోదరుడు)

జ: ఇస్లాం ఒక సులభ ధర్మం. దైవదాసులు మోయగలిగినంత బరువు మాత్రమే వారిపై విధించబడింది. "శాయశక్తులా అల్లాహ్‌కు భయపడండి" (అత్తగాబున్ -16) అని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు.

"మేము దేని నుంచి మిమ్మల్ని వారించామో దాన్నుండి మీరు ఆగిపోండి. మరి మేము దేనిని చేయమని ఆజ్ఞాపించామో దానిని శాయశక్తులా చేయండి" అని దైవ ప్రవక్త ﷺ ఉపదేశించారు. (బుఖారీ, ముస్లిం)

మీరు మస్జిద్‌కు 25 కి.మీ దూరంలో ఉంటున్నారు కాబట్టి సామూహిక నమాజులో పాల్గొనాల్సిందేనన్న ఆజ్ఞ మీకు వర్తించదు. మీరున్న చోటే ఒంటరిగా నమాజ్ చేసుకోవచ్చు. అయితే మీరుంటున్న ఎడారి ప్రదేశంలో మరి కొంత మంది ముస్లింలు కూడా ఉంటే వారితో కలిసి నమాజు చేయటం వాంఛనీయం. ఇదే ఉత్తమం కూడా. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో మీరు ఒంటరిగా నమాజు చేసినాసరే మీకు సామూహిక నమాజ్ నెరవేర్చిన పుణ్యం లభిస్తుంది. ఒక యుద్ధ సందర్భంగా మహా ప్రవక్త ﷺ ఇలా వక్కాణించారు: "మదీనాలో కొంతమంది ఉన్నారు. మీరెంత దూరం ప్రయాణం చేసినా, ఎన్ని లోయలు దాటి వెళ్ళినా వారు కూడా మీ వెంటే ఉన్నారని భావించండి. ఎందుకంటే అనారోగ్యం వారిని మదీనాలో ఉండిపోయేలా చేసింది". (ముస్లిం)

దీన్ని బట్టి అవగతమయ్యేదేమిటంటే మనిషిలో సంకల్పశుద్ధి ఉండి, ఒక కార్యాన్ని నెరవేర్చే అవకాశం దొరకనప్పుడు, అల్లాహ్ తన కృపతో ఆ కార్యాన్ని నెరవేర్చిన పుణ్యం అతనికి ప్రసాదించగలడు. కాబట్టి ఈ విషయంలో మీరు నిశ్చింతగా ఉండండి. కాని రోజూ ఐదు పూటల నమాజు మాత్రం విధిగా చేస్తూ ఉండండి. వేళకు చేస్తూ ఉండండి.

అఖీఖా ఎన్నాళ్ళ వరకు చేయవచ్చు?

ప్రశ్న: అఖీఖా ఏ వయస్సు వరకు చేయవచ్చు?

(అలీ - కువైట్)

జ: 'అఖీఖా' అనేది శైశవంతో ముడిపడి ఉంది. తల్లి కడుపు నుంచి బయటపడిన శిశువు శిరోముండనం చేయడమే అఖీఖా. దాంతోపాటు స్థోమత ఉంటే దైవం తమకు బిడ్డ రూపంలో అనుగ్రహాన్ని పొసగినందుకు కృతజ్ఞతా సూచకంగా పశువును జిబహ్ చేయటం సంప్రదాయం (సున్నత్). ఎందుకంటే దైవప్రవక్త ﷺ ఇలా సెలవిచ్చారు: "ప్రతి శిశువు తన అఖీఖాకి బదులు తాకట్టు (కుదువ)గా ఉంటుంది. కాబట్టి పుట్టిన ఏడు రోజులకు ఆ శిశువు తరఫున పశువును జిబహ్ చేయాలి. (శిశువుకు) పేరు పెట్టాలి. తల వెంట్రుకలు తీయాలి". (సుననె తిర్మిజీ)

ఈ హదీసు ద్వారా సుబోధకమయ్యేదేమిటంటే, ఏడవ రోజున అఖీఖా చేయాలి. ఒకవేళ కారణాంతరాల వల్ల ఏడవ రోజున చేయలేకపోతే 14వ రోజున చేయాలి, అదీ కుదరకపోతే 21వ రోజున చేయాలి. ఒకవేళ ఎవరయినా ఒక వయోజనుడు కూడా తన అఖీఖా జరగలేదని తెలిస్తే - ఎప్పుడయినాసరే - తన తరఫున అఖీఖా బాధ్యతను నెరవేర్చడం తప్పు కాదు.

పీడ కల వస్తే!?

ప్రశ్న: పీడ కల మూలంగా నేను తరచూ రాత్రి పూట భయాందోళనకు గురవుతూ ఉంటాను...

(ముహమ్మద్ అబ్దుల్ జబ్బార్ - కువైట్)

జ: రాత్రిపూట మీరు నిద్రలో భయపడటం, భయంతో, వ్యాకులతతో అరవటం - ఇదంతా షైతాను వల్లనే. హజ్రత్ జాబిర్ ﷺ కథనం ప్రకారం ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త ﷺ సన్నిధికి వచ్చి "నేను ఒక కల గన్నాను. ఆ కలలో ఒకతను నా తల తీసేశాడు. నేనేమో అతని వెనకే పరుగులు తీస్తున్నాన"ని అన్నాడు. ఇదంతా విన్న దైవప్రవక్త ﷺ "నిద్రలో షైతాన్ నీ పట్ల చేసిన వెకిలి చేష్టల గురించి ఇతరులతో చెప్పుకోకు" అని సూచించారు.

నిద్రకు ఉపక్రమించినప్పుడు షరీయతు సూచించిన రీతిలో 'ధ్యానం' చేసుకుంటే ఇలాంటి షైశాచిక విన్యాసాల నుండి ఉపశమనం లభించవచ్చు. కాబట్టి మీరు నిద్రకు ముందు వుజూ చేసుకుని మస్నూన్ దుఆలు చేసుకోండి. ఉదాహరణకు: ఆయతుల్ కుర్సీ, నాలుగు 'ఖుల్' సూరాలు పఠించి, మీ రెండు చేతులపై ఊది, వాటిని మీ శరీరంపై స్పర్శించండి. ముందు మీ ముఖాన్ని, తర్వాత తలను, ఆ తర్వాత ఇతర శరీర భాగాలను తుడుచుకోవాలి. అల్లాహ్ మీ వ్యాకులతను దూరం చేయుగాక!

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

అనురాగ రావం

మృదువుగా మెలగండి

సమాజంలో బలవంతులు, బలహీనులపై దీన నిరుపేద జనాలపై దౌర్జన్యాలకు పాల్పడటమనేది తరతరాలుగా జరుగుతూ వస్తున్నదే. ఈ దమన నీతికి, దుర్మార్గాలకు అధికంగా బలయ్యేది అబలలైన స్త్రీలు, దళిత ప్రజలు, అనాథలే. ఈ బలహీన, నిరుపేద జనాల కోసం ధర్మం కల్పించిన హక్కులు వారికి దక్కకుండా చేయడం బడా బాబులకు, బలవంతులకు, అగ్ర గణాలకు మామూలే. ఒకవైపు వారి కనీన హక్కుల్ని కాలరాస్తూ మరోవైపు వారిని రక రకాలుగా వేధించటం, చిత్రహింసలకు గురి చేయడం వీరి హాబి అయి వుంటుంది. దైవప్రవక్త (ﷺ) ఇలాంటి దౌర్జన్యపరులకు పరలోకంలో వినాశం తప్పదని హెచ్చరించారు. బలవంతులు, బలహీనుల హక్కుల్ని దోచుకోవడాన్ని ఖండించారు. ఈ విషయమై నేడు మనం సైతం ఆత్మ పరిశీలన చేసుకో వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మన నడవడిక ద్వారాగానీ, మనం అవలంబిస్తున్న ఆచార వ్యవహారాల వల్లగానీ ఇస్లాం ధర్మానికి మచ్చ రాకుండా చూసుకోవాలి. ఇస్లాం బోధించే అభ్యుదయ సుమగంధాల్ని లోకానికి తెలియ జేసేందుకు శాయశక్తులా కృషి చేయాలి. అలా చేయని పక్షంలో ఆత్మ విరోధులై మన ధర్మం గురించి తప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తున్నందుకు మనం రేపు ప్రళయ దినాన రెండింతలు పాపాన్ని మోయవలసి ఉంటుందని గ్రహించాలి. మహా ప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఈ విషయంలో మనకు ఏ విధమైనటువంటి మార్గదర్శకం చేశారో గమనిద్దాం.

ఈ బలహీనుల చలువ వల్లనే మీకు (దైవం తరఫు నుంచి) సహాయం లభిస్తుందని, ఉపాధి దొరుకుతుందని గ్రహించండి. ఒకవేళ మీరు నన్ను చేరుకోదలిస్తే, నన్ను బలహీనుల్లోనే అన్వేషించండి. స్వర్గంలో మీకు నా సహచర్యమే ఇష్టమైతే పేదరికాన్ని ప్రేమించండి. నేను ఇద్దరి విషయమై మిమ్మల్ని పదే పదే హెచ్చరిస్తున్నారు. ఆ ఇద్దరిలో ఒకరు: అనాథలు. రెండవ వారు: స్త్రీలు.

వితంతువుల, నిరుపేదల బాగు కోసం పరిశ్రమించేవాడు దైవ మార్గంలో పోరాడే యోధుడితో సమానం అని నేను మీతో అంటున్నాను. అతడు అలుపెరగ కుండా దైవారాధన చేసే భక్తుడితో, నిరంతరంగా ఉపవాసాలు పాటించే ధర్మపరాయణుడితో సమానం. అగత్య పరులు వస్తుంటే వద్దని, రాని వారి కోసం వెంపర్లాడే మీ విందులు అత్యంత ఘోరమైనవని మరువకండి. 'స్వర్గంలో నా సహచర్యంలో చోటు లభించడం గొప్ప అదృష్టం' అన్న విషయం మీకు తెలుసని నాకు తెలుసు. అనాథల్ని ఆదరించండి. వారి పోషణా బాధ్యతను మనస్ఫూర్తిగా స్వీకరించండి. వారితో దురుసుగా, కఠినంగా వ్యవహరించకండి. ఈ నా ఆజ్ఞల్ని గైకొన్నవారు మరియు నేను స్వర్గంలో ఈ రెండు వ్రేళ్ళ మాదిరిగా ప్రక్కప్రక్కనే కలిసి ఉంటాము.

(అదిగో ఆ స్త్రీ మూర్తిని చూడండి!) ఆమెకు తినడానికి ఆయిషా(ﷺ) మూడు ఖర్జూరాలు ఇచ్చింది. ఆమె వాటిలో రెండు ఖర్జూర పండ్లను తన ఇద్దరు కూతుళ్ళకు చెరో ఒకటి ఇచ్చి మిగిలిన ఒక ఖర్జూర పండును తను తినబోయింది. (ఆ ఇద్దరు పిల్లలు బాగా ఆకలి మీద ఉన్నారు కాబోలు!) అది కూడా ఇచ్చేయమని అడిగారు. వెంటనే ఆమె ఆ ఖర్జూరాన్ని రెండు ముక్కలుగా చేసి కూతుళ్ళిద్దరికీ చెరో ముక్క పంచి పెట్టింది. అది చూసి ఆయిషా (ﷺ) ఎంతో సంతోషిస్తూ నాతో చెప్పింది. ఆ మాతృ మూర్తి చేసిన పనికి మెచ్చుకొని అల్లాహ్ ఆమె కోసం స్వర్గం తప్పనిసరి చేశాడు. అలాగే ఆమెకు నరకాగ్ని నుండి విముక్తి నొసగాడు. అవును, ఇద్దరు కూతుళ్ళను యుక్త వయస్సు వచ్చే వరకూ పోషించిన వారు ప్రళయ దినాన వస్తారు. అప్పుడు నేను మరియు వారు ఈ రెండు వ్రేళ్ళ మాదిరిగా ఉంటాం.

మరి కొన్ని విషయాలు మీకు చెప్పదలిచాను - వ్యాధిగ్రస్తులను పరామర్శించండి. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టండి. మీరు మీ సోదర ముస్లింను పరామర్శించడానికి వెళ్ళి తిరిగి వచ్చేంత వరకూ స్వర్గంలో స్వర్గపు తాజా పండ్లు ఏరడంతో సమానమని నేనంటున్నాను. మీరు ఉదయం పూట వెళ్ళి రోగిని పరామర్శిస్తే 70 వేల మంది దైవ దూతలు సాయంత్రం వరకూ మీ శ్రేయస్సు కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉంటారు. అదే సాయంత్రం వేళ పరామర్శిస్తే ఉదయం వరకూ 70 వేల మంది దైవ దూతలు మిమ్మల్ని దీవిస్తూ ఉంటారు. ఇంకా మీ కోసం స్వర్గపు తాజా ఫలాలు ఏరి ఉంచబడతాయి. (కాబట్టి) శుభవార్తలు తెలియ జేసేవారిగా ఉండండి. సౌలభ్యాన్ని కలుగ జేయండి. లజ్జా బిడియాలు విశ్వాసులకు ఆభరణం. అవి పూర్తి ప్రయోజన దాయకం. విశ్వాసి తన ఉత్తమ నడవడిక మూలంగా ఒక నిత్య ఉపవాసి స్థాయికి, రాత్రంతా మేల్కొని ఆరాధన చేసే భక్తుని స్థాయికి చేరుకుంటాడన్న విషయం మరువకండి. అలాగే ఉత్తమ నడవడికను కలిగి ఉన్న వ్యక్తికి స్వర్గంలో అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఒక గృహాన్ని ఇప్పించేందుకు నేను పూచీ వహిస్తున్నాను.



ఓ మనిషీ! పాపాల నుండి రక్షించుకో

షేఖ్ రియాజ్

అల్లాహ్ మనిషిని స్వేచ్ఛా జీవిగా సృష్టించాడు. మనిషి ఈ స్వేచ్ఛను వినియోగించుకుని మంచి లేదా చెడు మార్గాలను అవలంబించవచ్చు. "మరి మేమతనికి (మంచి, చెడుకు సంబంధించిన) రెండు మార్గాలను చూపాము". (అల్ బలద్ :10)

మరో చోట అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "మేమతనికి మార్గం కూడా చూపాము. తద్వారా అతను కృతజ్ఞుడు అయినా కావచ్చు లేదా మేలును మరచిన వాడైనా కావచ్చు". (అద్ దహ్ర్: 3)

సర్వలోకాల సృష్టికర్త అయిన అల్లాహ్ మానవునికి శక్తియుక్తులను, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనిచ్చి ఇట్టే వదలిపెట్టలేదు. అతని మార్గదర్శనం కొరకు గొప్ప ఏర్పాట్లు చేశాడు. ప్రవక్తలను పంపి, గ్రంథాలను అవతరింపజేసి, వీరి ద్వారా సన్మార్గం ఏదో, దుర్మార్గం ఏదో చాలా చక్కగా వివరించాడు.

ఎవరైతే దైవవిధేయతా మార్గాన్ని అవలంబిస్తారో వారు స్వర్గ సౌఖ్యాలను అనుభవిస్తారు. మరెవరైతే దైవ తిరస్కార మార్గమైన దుర్మార్గాన్ని అవలంబిస్తారో వారు భగభగమండే నరకాగ్నికి ఆహుతి అవుతారు. కాబట్టి మానవులందరూ పరలోకంలోని శాశ్వతమైన సుఖ సౌఖ్యాల జీవనం కొరకు ఇహలోకంలో ఒకే ఒక్క సృష్టికర్త అయిన అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన చూపిన మార్గాన్ని ఎన్నుకొని ఆయనకే విధేయతను చూపుతూ, ఆయన వారించిన నిషిద్ధ (హరామ్) పనులకు దూరంగా ఉంటూ సహనంతో జీవనం గడపాలి.

అదే విధంగా మంచితోపాటు చెడు కూడా వస్తూ ఉంటుంది. కాని నిజమైన విశ్వాసి (ముస్లిం) యొక్క లక్షణం ఏమిటంటే, మంచిని ఆస్వాదించి చెడు నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు. సృష్టికర్త అయిన అల్లాహ్ తన దాసులను పాపాల నుండి రక్షణ పొందేందుకు ఎన్నో హెచ్చరికలు చేశాడు. ముందు జాగ్రత్తలు, సూచనలను సూచించాడు.

ఆదం హవ్వా (అ)లు తప్పు చేయటం వల్లనే స్వర్గం నుంచి తీసివేయబడ్డారు

పాప కారణంగానే మన మాతాపితలైన ఆదం, హవ్వా (అలైహిమస్సలాం)లను స్వర్గం నుంచి తీసివేయడం జరిగిందన్న విషయాన్ని ప్రతి మనిషీ ఎల్లప్పుడూ ఆలోచిస్తూ ఉండాలి. చివరికి షైతాన్ వారిని పెడత్రోవ పట్టించి అక్కడి (స్వర్గం) నుంచి బయటికి తీసివేయించాడు. మేము వారిని ఇలా ఆదేశించాము: "దిగిపోండి. మీరు ఒండొకరికి శత్రువులు. ఒక నిర్ణీత కాలం వరకు భూమిపైనే ఉండి మీరు లబ్ధి పొందవలసి ఉంది". అప్పుడు ఆదం (అలైహిస్సలాం) తన ప్రభువు నుంచి కొన్ని మాటలు నేర్చుకుని పశ్చాత్తాపం చెందారు. అల్లాహ్ ఆయన పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు. నిశ్చయంగా ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడు కూడాను". (అల్ బఖరా: 36, 37)

అల్లాహ్ వినేవాడు, చూచేవాడు

పాపాల నుండి చాలా సులువుగా తప్పించుకోవచ్చు. అదెలా సాధ్యం? అని సందేహపడుతున్నారా! నాకు చెవులిచ్చిన ప్రభువు నా మాట వినకుండా ఉంటాడా? నాకు కండ్లనిచ్చిన ప్రభువు నేను చేసే పనులను చూడకుండా ఉంటాడా? అనే భావనను మనం ఎల్లప్పుడూ కలిగి ఉండాలి.

ఉదాహరణకు:- షాపింగ్ మాల్‌లో సీసీ కెమెరాలుంటే దొంగతనం చేయాలనుకునే దొంగకు కెమెరాల ద్వారా తనను చూస్తున్నారు అనే భయం అతనిలో చోటు చేసుకుంటే ఇక అతను దొంగతనం చేయగలడా?

"భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువును గురించి అల్లాహ్‌కు తెలుసన్నది నీవు చూడటం లేదా? నాల్గవ వాడుగా అల్లాహ్ లేకుండా ఏ ముగ్గురి మధ్య కూడా మంతనాలు జరుగవు. అరవ వాడుగా అల్లాహ్ లేకుండా ఏ ఐదుగురి మధ్య కూడా (రహస్య మంతనాలు సాగవు.) అంతకన్నా తక్కువ మంది ఉన్నా, ఎక్కువ మంది ఉన్నా, వారెక్కడ ఉన్నా - ఆయన (జ్ఞానపరంగా) వారితో ఉంటాడు. మరి వారు చేసుకున్నవన్నీ ప్రళయ దినాన వారికి తెలియపరుస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అన్నీ తెలిసిన వాడు". (అల్ ముజాదల:7)

కాబట్టి ఎవరిలోనయితే "నన్ను సృష్టించి, పోషించి, పాలించే ప్రభువైన అల్లాహ్ ఎప్పుడూ నా వెంట ఉన్నాడు. నా ప్రతి క్రియను చూస్తున్నాడు. నా ప్రతి మాటను వింటున్నాడు. నా చూపుల చౌర్యాన్ని గమనిస్తున్నాడు. నా హృదయంలోని వాటిని సయితం ఎరిగిన వాడు" అనే భావన ఉంటుందో అటువంటి మనిషి పాప కార్యాలు ఎలా చేయగలుగుతాడు? తన ప్రభువు పట్ల కృతఘ్నతకు ఎలా పాల్పడగలుగుతాడు? "అల్లాహ్ కళ్ళలోని మోసాన్ని, గుండెల్లోని గుట్టును సయితం (బాగా) ఎరిగినవాడు". (అల్ మూమిన్: 19)

దైవ దూతలు రికార్డు తయారు చేస్తున్నారు

మనిషి తను చేసే ప్రతి పనిని, తను పలికే ప్రతి పలుకునూ దైవ దూతలు వ్రాస్తున్నారు. రేపు ప్రళయ దినాన వీటిని బట్టి లెక్క తీసుకోబడుతుంది. ఆ తర్వాత స్వర్గమో, నరకమో ఖరారు చేయబడుతుంది. ఈ విషయాన్ని ప్రతి వ్యక్తీ స్మరించుకుంటూ ఉండాలి.

"నిశ్చయంగా మీపైన పర్యవేక్షకులు నియమితులై ఉన్నారు. (వారు మీ కర్మలను నమోదు చేసే) గౌరవనీయులైన లేఖకులు. మీరు చేసేదంతా వారికి తెలుసు". (అల్ ఇన్ఫితార్: 10-12)

వేరొక చోట అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "మేమే మనిషిని సృష్టించాము. వాడి మదిలో మెదిలే ఆలోచనలు సయితం మాకు తెలుసు. మేమతని ప్రాణనాళం కంటే కూడా అతి చేరువలో ఉన్నాం. అతని వద్దకు వెళ్ళిన ఇద్దరు దైవదూతలు అతని కుడి, ఎడమల వైపు కూర్చొని ఉంటారు. మనిషి నోట ఒక మాట వెలువడటమే ఆలస్యం అతని దగ్గర ఒక పర్యవేక్షకుడు (దాన్ని నమోదు చేయటానికి) సిద్ధంగా ఉంటాడు".

(ఖాఫ్: 16-18)

పాపం చేసే ముందు మృత్యువును గుర్తు చేసుకోవాలి

పాపానికి పాల్పడే ముందు మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటే కూడా తలపెట్ట బోయే పాపం నుండి మనల్ని రక్షించుకో వచ్చు. ఎందుకంటే మరణం ఒక పచ్చి నిజం. అది ఎక్కడ, ఎప్పుడు, ఎలా సంభవిస్తుందో కూడా ఎవరికీ తెలియదు. దాన్నుండి ఎవ్వరూ తప్పించు కోలేరు.

"ప్రతి ప్రాణీ మృత్యువు రుచి చూడ వలసినదే. ప్రళయ దినాన మీరందరూ మీ కర్మల పూర్తి ఫలితాన్ని పొందుతారు. అప్పుడు ఎవడు నరకాగ్ని నుండి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశం కల్పించ బడతాడో అతడు నిశ్చయంగా సఫలీ కృతుడయ్యాడు. ప్రాపంచిక జీవితమైతే ఒక మాయా వస్తువు తప్ప మరేమీ కాదు". (ఆలి ఇమ్రాన్: 185)

సోదరులారా! మనిషి పాపం చేస్తున్న ప్పుడు విశ్వాసం నుంచి తిరిగి పోతాడు.అవిశ్వాస స్థితిలో ఉంటాడు. ఒకవేళ పాపం చేస్తున్న సమయంలోనే మరణం సంభవిస్తే ఇక అతని పరిస్థితి ఏమిటి? ఎవరు అతనిని రక్షిస్తారు?

మన శరీరావయవాలు మనకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి

ఒకవేళ మనం పాపాలకు పాల్పడితే రేపు ప్రళయం రోజు మన శరీరా వయవాలైన కాళ్ళూ, చేతులు, నోరు, చర్మం మొదలగునవి అల్లాహ్ ముందర సాక్ష్యమిస్తాయన్న సంగతి ఆలోచిస్తూ ఉండాలి. "ఆ విధంగా వారు నరకాగ్నికి చాలా సమీపంలోకి రాగానే వారి చెవులు, వారి కళ్ళూ, వారి చర్మాలు సయితం వారు చేస్తూ ఉండిన పనుల గురించి సాక్ష్యమిస్తాయి. "మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యమిచ్చారు"? అని వారు తమ చర్మాలనుద్దేశించి అడుగు తారు. "అన్ని వస్తువులకు మాట్లాడే శక్తిని చ్చిన అల్లాహ్‌యే మాకు మాట్లాడే శక్తిని ప్రసాదించాడు. మరి ఆయన వైపునకే మీరంతా మరలించబడతారు" అని అవి సమాధానమిస్తాయి. (హామీమ్ అస్సజ్దహ్: 20,21)

ప్రళయం రోజున పాపాత్ములు పశ్చాత్తాపంతో కుమిలి పోతారు.

ఇహలోకంలో సృష్టికర్త అయిన అల్లాహ్ ను, ఆయన ప్రవక్తలను, గ్రంథాలను తిరస్కరించి తన ఇష్టమొచ్చినట్లు పాపాల మీద పాపాలు చేస్తూ పోయే వ్యక్తి మరణ సమయంలోగానీ, ప్రళయ దినానగాని పశ్చాత్తాపంతో అల్లాహ్‌ను వేడుకుం టాడు. కాని ఏం లాభం? ఆ రోజు ఆ పశ్చాత్తాపాన్ని ప్రభువైన అల్లాహ్ అంగీ కరించడు. తిరిగి సత్కార్యాలు చేసే దానికి భూలోకంలోకి పంపించ డమూ జరుగదు. "చివరికి వారిలో ఎవరికైనను చావు వచ్చినప్పుడు 'ఓ మా ప్రభూ! నన్ను వెనక్కి పంపించు. నేను వదలి వచ్చిన లోకంలోకే వెళ్ళి సత్కార్యం చేస్తాను" అని అంటాడు. ముమ్మాటికి అలా జరుగదు. అది అతను అంటున్న ఒక మాట మాత్రమే. వారు మళ్ళీ సజీవులై లేచే రోజు వరకూ వారి వెనుక ఒక అడ్డు తెర ఉంటుంది".(అల్ మోమినూన్: 99,100)

వేరొక చోట ఇలా ఉంది: "ఆ రోజు దుర్మార్గుడైన వ్యక్తి తన చేతులు కొరుక్కుంటూ ఇలా అంటాడు: "అయ్యో! నేను దైవప్రవక్త మార్గాన్ని అనుసరించి ఉంటే ఎంత బాగుండేది! అయ్యో! నా పాడుగాను! నేను ఫలానా వ్యక్తిని స్నేహితునిగా చేసుకోకుండా ఉంటే ఎంత బాగుండేది! నా వద్దకు ఉపదేశం వచ్చిన

"నన్ను సృష్టించి, పోషించి, పాలించే ప్రభువైన అల్లాహ్ నా చూపుల చౌర్యాన్ని గమనిస్తున్నాడు. నా హృదయంలోని వాటిని సయితం ఎరిగినవాడు" అనే భావన ఉన్న మనిషి పాప కార్యాలు ఎలా చేయగలుగుతాడు?

తర్వాత కూడా వాడు నన్ను అపమార్గం పట్టించాడే! ఎంతెనా షైతాను మనిషికి (అదను చూసి) ద్రోహం చేసేవాడే".

(అల్ ఫుర్ఖాన్: 27-29)

పాపాలు శాపాలకు గురవుతాయి

పాపాల వలన మనిషి పరువు పోయి, నలుగురిలో నవ్వుల పాలవుతాడు. ఇంకా శాపానికి గురి అవుతాడు. "ఇస్రాయీలు సంతతిలోని అవిశ్వాసులు దావూదు నోట, మర్యం పుత్రుడైన ఈసా నోట శపించబడ్డారు. ఎందుకంటే వారు అవిధే యతకు పాల్పడేవారు. హద్దు మీరి ప్రవర్తించేవారు". (అల్ మాయిదా: 78)

శపించబడటం అంటే, దైవ కారుణ్యా నికి, శ్రేయోసాఫల్యాలకు దూరంగా ఉంచటం అని భావం. ఈ శాపానికి రెండు కారణాలు: 1) అల్లాహ్ విధించిన వాటిని నెరవేర్చకుండా ఉండటం. హరాం (నిషిద్ధ) విషయాల వెంట పడటం. 2) ధర్మం విషయంలో అతిశ యిల్లటం. లేనిపోని వాటిని ధర్మంలో జొప్పించి, దాని రూపురేఖలను మార్చి వేయటం.

(అహ్సనుల్ బయాన్ – తెలుగు – పేజీ: 524)

సోదర సోదరీమణులారా! పాపాలన్నిం టిలో అతి ఘోరమైన, క్షమించరాని పాపం సర్వ లోకాలకు ఒకే ఒక్క సృష్టికర్త అయిన అల్లాహ్‌ను విశ్వసించకుండా, ఆయన సృష్టించిన సృష్టితాలను ఆయనకు సహవర్తులుగా (షిర్క్) చేయడటం. రెండవది: దేవుడు విధించిన ఆజ్ఞలను పాటించకుండా (హరాం) నిషిద్ధ మైన పనులు చేయటం. ఎవరైతే ఇటు వంటి పాపాలకు పాల్పడుతున్నారో వెంటనే ఆ పాపాలను వదిలేసి పశ్చాత్తాపం చేసుకొని పైన తెలిపిన విషయాలను గనక ప్రతి వేళ గుర్తు చేసుకుంటూ జాగ్రత్తను వహిస్తే ఇన్షాఅల్లాహ్ పాపాల నుండి రక్షణ పొందవచ్చు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా...!

IPC ఆసిమా బ్రాంచ్, తెలుగు సెక్షన్ ఆధ్వర్యంలో 2010 జులైలో 25 మంది న్యూ ముస్లింలు గ్రీన్ లాండ్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా "మనో వసంతం ఖుర్‌ఆన్" అన్న అంశంపై బ్రదర్ సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ ప్రసంగించారు. ఆటల పోటీల్లో, సాంస్కృతిక పోటీల్లో న్యూ ముస్లింలు ఎంతో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేయబడ్డాయి.











ఐపిసి ఖైతాన్ బ్రాంచ్, తెలుగు సెక్షన్ ఆధ్వర్యంలో 2010 జూన్‌లో 11 మంది న్యూ ముస్లింలు గ్రీన్ లాండ్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా "ఇస్లాం ఆరోగ్యానికి ఇచ్చిన ప్రాముఖ్యత" అన్న అంశంపై చర్చ జరిగింది. అనంతరం బహుమతి ప్రదానం చేయబడింది.





4

నేటి బాలలే రేపటి పౌరులు

హజ్రత్ ఇద్రీస్ (అ) అతి ఎక్కువగా పరిశోధన చేసేవారు గనక ఆయనకు 'ఇద్రీస్' అని పేరు పడింది. ప్రపంచ మంతటిలో కలంతో వ్రాసిన మొదటి వ్యక్తి ఆయనే. హజ్రత్ ఇద్రీస్ (అ)గారు లెక్కల విధానాన్ని కనిపెట్టారు. సూర్య చంద్ర నక్షత్రాల గురించి పరిశోధన చేసిన తొలి వ్యక్తీ ఆయనే. ఆ విధంగా ఆయన ధరిత్రిపై తొలి శాస్త్రవేత్త కూడా. హజ్రత్ ఇద్రీస్ (అ)గారు మొదటిసారి గుడ్డలు కుట్టి ధరించిన వారు.

- అబుల్ తర్గన్

మరుసటి రోజు పిల్లలందరూ హుషారుగా నవ్వుకుంటూ వచ్చారు. అలీ క్లాసులోకి ప్రవేశించగానే ఒకర్నొకరు త్రోసుకుంటూ గబగబా వచ్చి అతని చుట్టూ గుమిగూడారు. 'హజ్రత్! చలియే, ఖిస్సా బోలియే' అంటున్నారు.

'ముందు హాజరు తీసుకోవాలి. తరువాత కొంత సేపు సంభాషణ. ఆ తర్వాతే కథ' అన్నాడు అలీ. వారందరినీ చక్కగా వరసతీరి కూర్చోమని చెప్పాడు. అందరూ అలాగే కూర్చున్నారు. అలీ కూడా కూర్చున్నాడు. హాజరు తీసుకుని కథ మొదలు పెట్టాడు.

మానవాళికి మార్గదర్శకత్వం వహించ డానికి అల్లాహ్ ఒక లక్ష 24 వేల మంది ప్రవక్తల్ని ప్రభవింపజేశాడన్న విషయం మీకు తెలిసే ఉంటుంది. ఈ ప్రవక్తల పరంపరలోని ఓ ప్రవక్త హజ్రత్ ఇద్రీస్ (అ). ఈయన 'నూహ్' అనే ప్రవక్తకి చాలా కాలం ముందు వచ్చారు. హజ్రత్ ఇద్రీస్ (అ) గారితో నూహ్ ప్రవక్తకి రక్త సంబంధం కూడా ఉంది. ఆయన నూహ్ ప్రవక్తకి ముత్తాత అవుతారు.

అందరూ చెవులు రిక్కించి వింటు న్నారు. కథ సాగిపోతూ ఉంది. హజ్రత్ ఇద్రీస్ (అ) అతి ఎక్కువగా పరిశోధన చేసేవారు గనక ఆయనకు 'ఇద్రీస్' అని పేరు పడింది. ప్రపంచమంతటిలో కలంతో వ్రాసిన మొదటి వ్యక్తి ఆయనే. హజ్రత్ ఇద్రీస్ (అ)గారు లెక్కల విధానాన్ని కనిపెట్టారు. సూర్యచంద్ర నక్షత్రాల గురించి పరిశోధన చేసిన తొలి వ్యక్తీ ఆయనే. ఆ విధంగా ఆయన ధరిత్రిపై తొలి శాస్త్రవేత్త కూడా. హజ్రత్ ఇద్రీస్ (అ)గారు మొదటి సారి గుడ్డలు కుట్టి ధరించినవారు. అందరూ మంత్రించిన బొమ్మల్లాగా కదలకుండా కూర్చున్నారు.

హజ్రత్ ఇద్రీస్ (అ)గారు మంచి పనులు చాలా ఎక్కువ చేసేవారు. ఆ కాలంనాటి ప్రజలందరూ కలిసి చేసే సత్కార్యాలకు ఆయనగారి ఒక్కరోజు సత్కార్యాలు సరితూగేవి. అందుకే దైవదూతలు సయితం ఆయన కార్య శైలిని చూసి ఆశ్చర్యపోయారు.

అందరూ మంత్ర ముగ్ధులై వింటున్నారు. మధ్యలో కథ ఆపేసి 'కథ ఎలా ఉందో చెప్పండి' అని ప్రశ్నించాడు అలీ.

'కథ చాలా బాగుంది. మాకు బాగా నచ్చింది' అన్నారు. 'కథ వినటానికి ఆసక్తి కనబరుస్తున్నారు సరే. మరి కథ చదవటం కూడా మీకు ఇష్టమేనా?....'

'అవును కథలు చదవటం కూడా మాకు ఇష్టమే. కానీ ఇటువంటి మంచి కథలుండే పుస్తకాలు ఎక్కడున్నాయి?'

'ఇటువంటి కథలుండే పుస్తకాలు తేనెలొలికించే తేట తెలుగులో నేను తెచ్చిస్తే మీరు చదువుతారా?'

'ఓ. చదువుతాం, చదువుతాం, తప్ప కుండా చదువుతాం'. వారిలో ఒక తెలివైన కుర్రాడు-'మాకు మేము చదువు కోవడమే కాకుండా మీరు కూడా కథలు చెబుతూ ఉండవలసిందే!' అన్నాడు. అలాగేనంటూ మళ్ళీ కథ ప్రారంభించాడు అలీ.

హజ్రత్ ఇద్రీస్ (అ)గారు 'నబీ మరియు రసూల్ కూడాను. అల్లాహ్ ఖాబీల్ (ఆదం గారి జేష్ఠ పుత్రుడు) సంతానం వైపు ఆయన్ను పంపించాడు. అల్లాహ్‌ను ఆరాధించమని, పుణ్య కార్యాలు చేస్తూ ఉండమని ఆయన వారికి ఉపదేశిం చారు. వజ్ర సంకల్పం గల ప్రవక్తల్లోని ఓ ప్రవక్త హజ్రత్ ఇద్రీస్ (అ) గారు. ఈ కారణంగానే అల్లాహ్ ఆయన అంతస్తును పెంచాడు. ఉత్తమోత్తమ ప్రవక్తగా ఆయన్ను పేర్కొన్నాడు. మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) మేరాజ్ (గగన యాత్ర) సమయాన నాల్గవ ఆకాశంలో ఆయన్ను కలుసుకున్నారు.

సమయం అయ్యింది... అందరూ అలీ చుట్టూ నిలబడ్డారు. కొందరు అతని వైపు ప్రేమతో చూస్తున్నారు. కొందరు అతని చేతిని తాకుతూ ఆనందంతో పొంగి పోతున్నారు. 'సరే. ఇక ఇళ్ళకు వెళ్ళండి' అన్నాడు అలీ. పిల్లలందరూ ఇళ్ళకు వెళ్ళిపోయారు. (సశేషం)

హసన్ సయ్యిద్



అల్లాహ్ మళ్ళీ ప్రవక్తలను ప్రభవింపజేశాడు. ప్రవక్తలు ప్రతి జాతిలోనూ వచ్చారు. దాదాపు ప్రతి ప్రవక్తా మార్గం మరచిన ప్రజలకు రుజుమార్గం చూపిస్తూ పాప క్షమాపణకై విశ్వ ప్రభువుని వేడుకొని ఆయన వైపు మరలితే ఆయన మీకు ప్రపంచ జీవితంలో కూడా శుభాలు, సౌఖ్యాలు ప్రసాదిస్తాడని తెలియజేశాడు. ఇలా ఈ మహా లక్ష్య సాధన కోసం ప్రభవింప జేయబడిన అనేకమంది దైవ ప్రవక్తలను, వారి సముదాయాలను మనం ఎరుగం. ఎందుకంటే అల్లాహ్ వారి గురించి మనకు తెలియజేయలేదు గనక. ఈ విషయాన్నే ఆ పరమ ప్రభువు ఇలా సెలవిస్తున్నాడు: "(ఓ ప్రవక్తా!) నీకు పూర్వం వచ్చిన ప్రవక్తలలో కొందరి వృత్తాంతాలు నీకు తెలిపాము. అనేకమంది వృత్తాంతాలు తెలియజేయలేదు". (దివ్య ఖుర్ఆన్ – 4: 164)

అయితే అల్లాహ్ మనకు 'ఆద్' జాతి గురించి, ఇతర కొన్ని జాతుల గురించి తెలియజేశాడు. ఆద్ జాతి ప్రజలు సయితం విగ్రహారాధనకి గురై ఉండేవారు. అలాగే వారిలో నీతి బాహ్యమైన విషయాలు సయితం ఎక్కువగానే ఉండేవి. వారి వద్దకు అల్లాహ్ హూద్ ప్రవక్తను పంపాడు. ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా పేర్కొంటున్నాడు: "ఆద్ జాతి ప్రజల దగ్గరకు మేము వారి సోదరుడు హూద్‌ని (ప్రవక్తగా నియమించి) పంపాము. అతను ఇలా అన్నాడు: 'నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు. మీవన్నీ అభూత కల్పనలు తప్ప మరేమీ కావు. (అలాంటి మిథ్యా దైవాలను ఇకనైనా వదలి పెట్టండి)".
(దివ్యఖుర్ఆన్ – 11: 50)

అలా ఆయన వారిని సంస్కరించడానికి యత్నించారు. కొందరిని మినహాయించి అధిక శాతం మంది అవిధేయతకు పాల్పడ్డారు. తత్కారణంగా వారిపై భయంకరమైన ఉపద్రవం విరుచుకుపడింది. అల్లాహ్ తన అనుగ్రహంతో హూద్‌ని, ఆయనతోపాటు విశ్వసించిన వారిని రక్షించాడు. చాలా కాలం వరకు నిజ ధర్మాన్నే అనుసరించారు వారు.

ఆ విధంగా అల్లాహ్ అనేక ప్రాంతాల్లో అనేక మంది ప్రవక్తల్ని నియమించి పంపాడు. వారిలోని ఒకరు 'సమూద్' జాతి ప్రజలు. వీరి వద్దకు సాలెహ్ ప్రవక్త వచ్చారు. ఆయన సయితం గత ప్రవక్తల బోధనల్ని సత్యమని ధృవపర్చారు. దానికి ఆ జాతి ప్రజలు ఇలా అన్నారు: "సాలెహ్! గతంలో నీవు మా మధ్య ఎంతో మంచివాడివిగా ఉన్నావు. నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాము. (ఉన్నట్టుండి ఇప్పుడేమయింది నీకు?) మా తాతముత్తాతల కాలం నుండి వస్తున్న ఈ దైవాలను పూజించుకో నీయకుండా మమ్మల్ని ఎందుకు ఆపుతున్నావు? నీవు బోధిస్తున్న విషయం పట్ల మాకు అనుమానంగా ఉంది. అది మమ్మల్ని తీవ్ర సందిగ్ధంలో పడవేసింది". (ఖుర్ఆన్ – 11: 62)

హజ్రత్ సాలెహ్ ﷺగారి హితబోధతో ప్రభావితులైనవారు ఓ సుదీర్ఘ కాలం వరకు నిజమార్గంపై ఉన్నారు. ఆ తర్వాత హజ్రత్ ఇబ్రాహీమ్ ﷺ ప్రభవింపజేయబడ్డారు. అప్పుడు ఈ విశ్వమంతటా ఒక్కడు కూడా ఏకదైవారాధకుడు లేడు. ఆయన ఇరాక్ దేశంలో జన్మించారు. సత్యం, ధర్మం వైపు తన జాతివారిని ఆహ్వానించి ఆయన్ను ఆ జాతి ప్రజలు అనేక ఇబ్బందులకు గురి చేశారు. ఆయన్ని తొలుత విశ్వసించినవారి భార్య 'సారా' మరియు పెదనాన్న కొడుకు హజ్రత్ 'లూత్ (అ) మాత్రమే. ప్రవక్త ఇబ్రాహీమ్ ﷺ గారి రాక అనంతరం ఈ పుడమిపై ఎక్కడో ఓ చోట ఏకదైవారాధకులు ఉంటూనే వచ్చారు. అది కూడా ఆయనగారి వంశానికి చెందినవారే అవడం మరో విశేషం. చూడండి!

"ఇబ్రాహీమ్ వృత్తాంతాన్ని జ్ఞాపకం తెచ్చుకో, అతను తన తండ్రితో, తన జాతి ప్రజలతో 'మీరు పూజిస్తున్న వాటితో నాకెలాంటి సంబంధం లేదు. నా సంబంధం అంతా నన్ను సృష్టించిన సర్వేశ్వరునితో మాత్రమే ఉంది. ఆయనే నాకు దారి చూపుతాడు' అన్నాడు. ఈ విషయాన్నే అతను తన సంతానంలో వదలి వెళ్ళాడు – వారు దాని వైపు మరలేందుకు".

(దివ్యఖుర్‌ఆన్ – 43: 26-28)

హజ్రత్ ఇబ్రాహీమ్ (عليه السلام) గారి స్వదేశం 'ఇరాక్' అని మనం ముందే తెలుసుకున్నాం. అక్కడి ప్రజలు పెట్టే కష్టాలకి బ్రతుకు భారమై సిరియా దేశానికి తరలి వెళ్ళారు ప్రవక్త ఇబ్రాహీమ్ (عليه السلام). అక్కడే ఆయన పరమపదించారు.

ఆయన కాలం నాటి మధుర స్మృతుల్ని గనక మనం కాసేపు నెమరువేసుకుంటే... ఆయనగారి రెండవ భార్య హజ్రత్ హాజిరా (عليها السلام) గర్భం దాల్చి పండంటి ఓ మగ బిడ్డ (ఇస్మాయీల్) కు జన్మనిచ్చింది. హజ్రత్ ఇబ్రాహీమ్ (عليه السلام) అల్లాహ్ ఆనతిపై తల్లీబిడ్డలిద్దరినీ తీసుకెళ్ళి 'మక్కా' (ఫారాన్) ఎడారి ప్రాంతంలో వదలి వచ్చారు. ఆ తర్వాత హజ్రత్ 'సారా (عليها السلام)' ద్వారా హజ్రత్ ఇస్హాఖ్ (అ) జన్మించారు. హజ్రత్ ఇస్హాఖ్ (అ) గారికి హజ్రత్ యాకూబ్ (عليه السلام) గారు పుట్టారు. ఆయన్నే 'ఇస్రాయీల్' అంటారు. ఆయన సంతానాన్నే 'బనీ ఇస్రాయీల్' అంటారు. హజ్రత్ యూసుఫ్ (عليه السلام) నుంచి హజ్రత్ ఈసా (عليه السلام) వరకు ప్రవక్తలందరూ 'ఇస్హాఖ్' గారి వంశంలోనే వచ్చారు. చూడండి దైవం ఎలా ఆశీర్వదిస్తున్నాడో!

"ఇబ్రాహీమ్ కుటుంబ సభ్యులారా! (వినండి) మీపై అల్లాహ్ కారుణ్యం, ఆయన శుభాలు ఉన్నాయి". **(దివ్యఖుర్‌ఆన్- 11: 73)**

అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) కూడా ఇబ్రాహీమ్ (عليه السلام) గారి జేష్ఠ పుత్రుడైన హజ్రత్ ఇస్మాయీల్ (عليه السلام) గారి వంశంలోంచి వచ్చినవారే.

ఇటు మక్కాలోనే స్థిరపడిపోయిన హజ్రత్ ఇస్మాయీల్ (عليه السلام) గారు మక్కా పట్టణానికి నాయకుడయ్యారు. ఆయన తర్వాత నాయకత్వం ఆయన సంతానంలోనే కొనసాగింది. ఆయనగారి సంతానం రోజు రోజుకి అభివృద్ధి చెందసాగింది. వారు మక్కా చుట్టుప్రక్కల ప్రాంతాల్లో విస్తరించారు. వారందరూ కొన్ని వందల సంవత్సరాల వరకు దైవ విధేయతా మార్గమైన ఇస్లాం పైనే నిలకడగా ఉన్నారు. వారందరూ తమ పితామహుడైన ఇబ్రాహీమ్ (عليه السلام)గారి బాటపైనే నడిచారు. ఈ విధంగా రేయనక పగలనక కాలం బిరబిరా సాగిపోయింది. చివరికి వారిలో 'అమ్ర్ బిన్ లుహయ్యి' పుట్టుకొచ్చాడు. అతనే బహు దైవారాధనను మళ్ళీ ప్రవేశపెట్టాడు. ప్రవక్త ఇబ్రాహీమ్ (عليه السلام) గారి సంప్రదాయాలను తుంగలో తొక్కివేశాడు. అతని కథ ఇలా మొదలవుతుంది.....

(సశేషం)

కర్తవ్యం పిలుస్తోంది...

(5 పేజీ తరువాయి భాగం)

స్వాతంత్ర్యానికి పూర్వం శుల్కం చెల్లించి కన్యల్ని అమ్మే, కొనేవారు, ప్రస్తుతం వరకట్నం ఇచ్చి భర్తల్ని కొంటున్నారు, అమ్ముకొంటున్నారు. ఈ రెండు పద్ధతుల్లోనూ బలి పశువు స్త్రీయే.

చివరిగా ఒక మాట చెప్పక తప్పదు. ఎవరు సంకెళ్ళలో బంధించబడ్డారో వారే బంధ విముక్తికై స్థిర చిత్తంతో పోరాడాలి. 'స్త్రీ స్వర్గానికి సోపానం' అని ప్రవక్త మహాశయుల వారు ప్రకటించి ఆ ఆశయ సిద్ధికై ప్రజల్లో చైతన్య కణాల్ని రాజేసినట్లే స్త్రీలు సయితం తమ శక్తి యుక్తుల్ని వాడి స్వేచ్ఛాసమానత్వాన్ని సాధించుకునే దిశగా పయనించి సమాజాన్ని, దేశాన్ని అభ్యుదయ పథాన నడిపించిన నాడే భవిష్యదర్శనం సుఖ శాంతులకాలవాలమవుతుంది. ఇక్కడ విస్మరించరాని విషయమేమిటంటే స్త్రీల భాగస్వామ్యం లేనిదే సమాజ పురోగాభివృద్ధి అసాధ్యం. పురుష సహకారం లేనిదే అది సాధ్యం అవదు. అంటే– స్త్రీ లేని పురుష ప్రపంచాభివృద్ధి బలహీనపడితే, పురుషుడు లేని స్త్రీ సమాజ అభ్యుదయం కుంటుపడుతుంది. సంసార రథం సాఫీగా సాగదు. సంతానం సత్పౌరులుగా ఎదగరు. ఈ మటుకు విలువలు, బాధ్యతలు మృగ్యమైన ఏ దేశం అభివృద్ధిని పొందలేదు. ఈ పరిణామ ప్రక్రియలో స్త్రీల పాత్ర ఏపాటిదై ఉండాలి? అంటే– 1) స్వయం ఉద్ధరణ. 2) సమాజం యావత్తులో పరివర్తనం తీసుకురావాల్సిన బాధ్యత.

ఆ మేరకు తల్లులుగా వారు ముందు తమ కుటుంబాల్లోనే సమరస భావానికి పునాదులు వేయాలి. పిల్లల్లో చిన్న నాటనే విశాల భావాన్ని ప్రోది చేయాలి.. స్త్రీ పురుషుల విషయంలో మహా ప్రవక్త (స) చేసిన హితవుల్ని పిల్లలకు బాల్య దశ నుండే నూరిపోయాలి. వారిలో తమ చెల్లి, తల్లి, పిన్నీల పట్ల గౌరవాన్ని, అభిమానాన్ని పెంపొందించాలి. సత్య నిరతి, సోదర భావం, ప్రేమ, కరుణ, దయ, క్షమ, పరోపకార పారీణత వారిలో నిత్య గుణాలుగా రూపొందాలి. 'తల్లి ఒడి ప్రాథమిక బడి' గనుక – తల్లుల ఈ శిక్షణ – సంతాన వ్యక్తిత్వాన్ని సంరక్షిస్తుంది. కుటుంబంలో శాంతిని నింపుతుంది. ఆ దరిమిలా సమాజంలో, దేశంలో శాంతి, అభ్యున్నతి, ప్రగతి, పురోగాభివృద్ధి మూడు పువ్వులు ఆరు కాయల్లా విరాజిల్లుతుంది. స్త్రీలందరూ తమ ఈ కర్తవ్యాన్ని గుర్తించి అహరహం పరిశ్రమించినప్పుడే విశ్వ జనులందరికి సౌభాగ్యం ఇనుమడిస్తుంది. అందు నిమిత్తం కర్తవ్యం మహిళా లోకాన్ని పిలుపునిస్తోంది! స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంగా స్త్రీలందరూ సహజంగానే స్పందిస్తారని ఆశిస్తూ....



ధన పిపాసి ఖారూన్

మూలం:
షేఖ్ అబూ బకర్ నజ్జార్

(పూర్వ కాలంలో కథకులు, గొప్ప సంపద అని చెప్పడానికి 'ఖారూన్ ఖజానా' అని పోల్చి చెప్పేవారు. అంటే సాటిలేని మహా సంపద అన్న భావంతో అలా చెప్పేవారు)



"చివరికి మేము ఖారూన్‌ను, అతని నివాసాన్ని నేలలో కూర్చివేశాము. అప్పుడు అల్లాహ్ బారి నుండి అతన్ని ఆదుకోవటానికి ఏ సమూహమూ లేకపోయింది. మరి వాడు సయితం తనకు ఏ సాయమూ చేసుకోలేకపోయాడు".

(ఖుర్‌ఆన్ - 28: 81)



ఖారూన్, ప్రవక్త మూసా (అలైహిస్సలాం) వంశానికి చెందినవాడు. చాలా సంపన్నుడు. ఒక మహా ప్రాసాదంలో భోగభాగ్యాలతో తులతూగేవాడు. అత్యంత ఖరీదైన దుస్తులు ధరించేవాడు. అసంఖ్యాక బానిసలు ఎల్లప్పుడూ అతని సేవకు సిద్ధంగా ఉండేవారు. అన్ని రకాల సుఖ విలాసాలతో ఆడంబరంగా జీవితం గడిపేవాడు. అపారమైన ధన సంపత్తులు అతనిలో గర్వాన్ని పెంచాయి. అహం కారంతో విర్రవీగాడు.

ఖారూన్ బీదలను చూసి అసహ్యించు కునేవాడు. తెలివితేటలు లేకపోవడం వల్లనే వారు బీదరికంలో మగ్గుతున్నారని ఈసడించుకునేవాడు. తన తెలివితేటలు, వ్యాపార నైపుణ్యం వల్లనే తనకు అపార సంపద లభించిందని మిడిసిపడేవాడు.

జకాత్ చెల్లించవలసిందిగా ప్రవక్త మూసా (అలైహిస్సలాం)అతడికి చెప్పారు. జకాత్ అన్నది బీదలకు ఒక హక్కుగా సంపన్నులు చెల్లించవలసిన నిర్ధారిత వాటా. విశ్వాసులందరూ తప్పనిసరిగా జకాత్ చెల్లించాలని అల్లాహ్ ఆదేశిం చాడు. కాని ఈ సలహా విన్న ఖారూన్ కోపంతో మండిపడ్డాడు. తనపై దేవుని అనుగ్రహం వర్షిస్తుందని, తన సిరి సంపదలే అందుకు నిదర్శనమని ప్రవక్త మూసా (అలైహిస్సలాం)తో చెప్పాడు. తన జీవిత విధానాన్ని ఆమోదించినందువల్లనే దేవుడు తన సంపదను అనునిత్యం పెంచుతున్నాడని వాదించాడు. ప్రవక్త మూసా (అలైహిస్సలాం) అతడికి నచ్చజెప్పారు. దుర్మార్గపు ఆలోచనల పరిణామాలు నష్ట దాయకంగా ఉంటాయని హెచ్చరించారు.

చివరకు ఖారూన్ తన సంపదపై జకాత్ లెక్కించాడు. (జకాత్ అంటే పేదల కోసం, సమాజ శ్రేయస్సు కోసం అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టవలసిన సొమ్ము). జకాత్ లెక్కిస్తే తాను చెల్లించ వలసిన మొత్తం అతడికి చాలా ఎక్కువగా కనబడింది. అంత మొత్తం చెల్లించాలంటే ప్రాణాలు పోయినట్లనిపించింది. జకాత్ చెల్లించేది లేదని తిరస్కరించడమే కాదు, ప్రవక్త మూసా (అలైహిస్సలాం) తన స్వార్థ ప్రయో జనాల కోసం జకాత్ చట్టం తీసుకొచ్చా రని ప్రచారం మొదలు పెట్టాడు. ప్రవక్త మూసా (అలైహిస్సలాం)కు వ్యతిరేకంగా ప్రజల అభిప్రాయాన్ని కూడగట్టడానికి కొంత మందికి లంచాలు కూడా ఇచ్చాడు. ప్రవక్త మూసా (అలైహిస్సలాం) గురించి నానా విధాల పుకార్లు వ్యాపించేలా చేశాడు.

ఖారూన్ కుట్ర గురించి అల్లాహ్, ప్రవక్త మూసా(అలైహిస్సలాం)కు సావధానపర్చాడు. ఖరూన్ పిసినారి తనానికి, అల్లాహ్ చట్టాల పట్ల అతని తిరస్కారానికిగాను అతడిని శిక్షించాలని ప్రవక్త మూసా (అలైహిస్సలాం) దేవుణ్ణి ప్రార్థించారు. అల్లాహ్ ఆగ్రహం ఖారూన్‌పై విరుచుకుపడింది. భూమి ఒక్కసారిగా పగులుబారి ఖారూన్‌తో సహా అతడి భవనాన్ని, యావత్తు సంపదను తనలో కలిపేసు కుంది. ఖారూన్ అనేవాడు ఒకప్పుడు ఉండేవాడన్న చిహ్నాలు కూడా లేకుండా అతడు తుడిచి పెట్టుకుపోయాడు. ఖారూన్ సంఘటన మూసా (అలైహిస్సలాం)జాతి ప్రజలకు ఒక గుణ పాఠంగా మిగిలిపోయింది.

ఈ విషయమై దివ్య ఖుర్‌ఆన్‌లో ఇంకా ఏముందంటే, ఖరూన్ సంపదను చూసి ఈర్ష్య పడినవారు, అప్పటివరకు ఖారూన్‌ను కీర్తించడమే ఘనకార్యంగా భావించినవారు ఈ సంఘటన తర్వాత, "అల్లాహ్ ఎవరికి తలచుకుంటే వారికి సంపద ఇస్తాడు. ఎవరికి తలచుకుంటే వారికి నిరాకరిస్తాడు. మనపై అల్లాహ్

అనుగ్రహం లేనట్లయితే మనల్ని కూడా భూమి మ్రింగేసి ఉండేది. అల్లాహ్‌ను తిరస్కరించేవారు పురోభివృద్ధి సాధించ లేరు. ఈ ప్రపంచంలో బడాయిని కోరుకోని వారికి, దుర్మార్గానికి పాల్పడని వారికి మాత్రమే పరలోక స్వర్గవనాలు లభిస్తాయి" అనడం ప్రారంభించారు.

గ్రహించవలసిన పాఠాలు

☞ ఖారూన్ వంటి వారు ప్రపంచంలో చాలా మంది ఉన్నారు. కొంత మంది నడమంత్రపు సిరి పొంది తమ పాత రోజులను, కష్టాలను మరచిపోతారు. తాము కష్టపడి, శ్రమించి తమ తెలివి తేటలతో సంపాదించిందే ఇదంతా అనుకుంటారు. అందులో దేవుని కారుణ్యం లేదని భావిస్తారు. అల్లాహ్ పట్ల ఎలాంటి కృతజ్ఞత చూపించరు. అల్లాహ్ ఆదేశాలను విస్మరిస్తారు. బీదసాదలకు ఎలాంటి సహాయం అందించడం వారికి ఇష్టం ఉండదు. పైగా తమ సంపదను పెద్ద భవనాలు కట్టడం ద్వారా, సంపన్నులకు గొప్ప విందులు ఇవ్వడం ద్వారా, అనవసరమైన ఆడంబరాల ద్వారా, ఖరీదైన దుస్తులు, వాహనాల ద్వారా ప్రదర్శిస్తూ విర్రవీగుతుంటారు. మరి కొందరు ఇందుకు విరుద్ధంగా అత్యంత పిసినారులుగా మారిపోతారు. స్వంతం కోసం, తమ కుటుంబం కోసం ఖర్చు పెట్టడానికి కూడా వెనుకాడుతారు. సంపద పోగు చేయడంలోనే మునిగిపోతారు. కాని ఇలాంటివారు తాము ఈ ప్రపంచంలో కేవలం కొంత సమయం గడిపి వెళ్ళడానికి వచ్చామన్న వాస్తవాన్ని మరచి పోతుంటారు.

☞ అల్లాహ్ నిర్దేశించిన వాటాను బీదలకు చెల్లించడం ద్వారా మనిషి తన సంపదను పరిశుద్ధం చేసుకుంటాడు. లేనట్లయితే సంపద కలుషితమైపోతుంది. సంపద ఒక శాపంగా మారిపోతుంది. తన మార్గంలో ఖర్చు చేసిన సంపదను అనేక రెట్లు పెంచి ఇస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. దాన ధర్మాలకు ఖర్చు చేసినది తనకు ఇచ్చిన ఉత్తమమైన రుణంగా అల్లాహ్ అభివర్ణిస్తున్నాడు. అల్లాహ్‌కు రుణం ఇచ్చి ఆయన నుంచి తిరిగి పొందడం అన్నది మనిషికి ఎంత గౌరవప్రదం! ఎంత శుభప్రదం!!

☞ అల్లాహ్ మనిషికి ధన సంపదలను ఒక పరీక్షగా అప్పగిస్తాడు (అమానత్– అంటే ఏదన్నా వస్తువును జాగ్రత్తగా ఉంచమని ఎవరికైనా అప్పగించడం). ధనసంపదలు కూడా అల్లాహ్ మనిషికి అప్పగించిన అమానత్ (అప్పగింతే). తాను ఇచ్చిన ధనసంపదలతో ఎవరు ఏం చేస్తారోనని పరీక్షిస్తాడు.

సహరీ, ఇఫ్తార్ (పేజీ 3 తరువాయి భాగం)

మహనీయ అబూ హురైరా (రదియల్లాహు అన్హు) ఉల్లేఖించిన దాని ప్రకారం, ప్రవక్త శ్రేష్ఠులు (ﷺ) ఇలా బోధించారు: "అల్లాహ్ తన దాసుల్లో ఇఫ్తార్ చెయ్యడానికి త్వరపడేవారంటే చాలా ఇష్టమని అంటున్నాడు". (తిర్మిజీ)

'ఇఫ్తార్' చెయ్యడమే కాదు, ఇఫ్తార్ చేయించడం కూడా పుణ్యప్రదమే. జైద్ బిన్ ఖాలిద్ (రదియల్లాహు అన్హు) ప్రవక్త శ్రీ (ﷺ) చెప్పినట్లు ఉల్లేఖించారు: "ఒక ఉపవాస వ్రతం పాటించే వ్యక్తికి ఎవరయినా ఇఫ్తార్ (భోజనం) చేయించినట్లయితే అతనికి ఆ రోజా పాటించే వ్యక్తికి లభించే పుణ్యఫలమే ప్రాప్తమవుతుంది". (బైహఖీ)

అందుకే మన కాలంలో ఇఫ్తార్ విందులు విరివిగా జరుగు తున్నాయి. కాని వాటిలో దైవభక్తి, దైవ సంస్మరణ, దైవాదేశాల ప్రస్తావన, దైవాజ్ఞాపాలనా భావన – ఏ మేరకు ఉంటున్నాయి? వీటికి ఆ పుణ్యఫలం ప్రాప్తిస్తుందా? ఏమో!

తెలుగు సోదరులకు శుభవార్త

'తెలుగు ముస్లిం అసోసియేషన్' ఆధ్వర్యంలో కువైట్ మినిస్ట్రీ ఆఫ్ ఔఖాఫ్ ఇస్లామీయ విభాగం వారి అనుమతితో తెలుగులో జుమా ప్రసంగాలు జరుగుతున్నాయని తెలుపడానికి సంతోషిస్తున్నాము. ఇన్‌షా అల్లాహ్ 20-11-09 వ తేదీ శుక్రవారం నుండి ముర్గాబ్‌లోని మస్జిద్ అల్ హమద్ (ఆపోజిట్ మినిస్ట్రీ కాంప్లెక్స్)లో తెలుగు ఖుత్బా మొదలయింది. కనుక తెలుగు సోదరులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇట్లు
తెలుగు ముస్లిం అసోసియేషన్
కువైట్

రచయిత (త్రు)లకు మనవి

'నెలవంక'కు వ్యాసాలుగానీ, అభిప్రాయాలుగానీ, వార్తలుగానీ పంపగోరేవారు తమ స్వదస్తూరీతో పేజీకి ఒక వైపున మాత్రమే వ్రాసి సంతకంతో సహా నేరుగానూ, పోస్టు ద్వారానూ పంపవచ్చు. టైప్ చేసి పంపే రచనలు, వార్తలు ఆమోదించబడవు. అలాగే ఈమెయిల్ ద్వారాగానీ, ఔట్‌లుక్ ద్వారా గానీ పంపే రచనలు కూడా స్వీకరించబడవు. మాతో సహకరిస్తారని ఆశిస్తాము. – ఎడిటర్

సుప్రసిద్ధ హదీసు గ్రంథాల పరిచయం

(8వ పేజీ మిగతాది ...)

సునన్ ఇబ్నె మాజా

ఇమామ్ ముహమ్మద్ బిన్ మాజాచే సంకలనం చేయబడిన హదీసు గ్రంథమిది. ఇందులో మొత్తం 4418 హదీసులుండగా, వాటిలో 3542 హదీసులు ప్రామాణికమైనవి. 835 హదీసులు బలహీన (జయీఫ్) కోవకు చెందినవి, 41 హదీసులు కల్పితమైనవి. అంటే 80 శాతానికి పైగా హదీసులు ప్రామాణికమైనవే.

"సిహా సిత్తా" గాకుండా మరి కొన్ని సుప్రసిద్ధ హదీసు సంకలనాలు కూడా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన వాటిని ఇక్కడ పొందుపరుస్తున్నాము–

ముఅత్తా ఇమామ్ మాలిక్

ఈ పుస్తకం మదీనాకు చెందిన విఖ్యాత ఇమామ్ సయ్యిదినా మాలిక్ బిన్ అనస్ –రహ్మ. (జననం: హి.శ. 82. మరణం: హి.శ. 170) చే సేకరించబడినది.

ప్రజలు పదే పదే త్రొక్కి, నలిపి సుగమం చేసిన మార్గాన్ని 'ముఅత్తా' అంటారు. దైవప్రవక్త (స) మొదలుకుని, తాబయీలు, ఆ తరువాతి తరాల వారు క్రియాత్మకంగా పాటించిన హదీసులను ఇమామ్ మాలిక్ (ర) క్రోడీకరించటం వల్ల ఈ సంకలనానికి "ముఅత్తా ఇమామ్ మాలిక్" అనే పేరు వచ్చింది. హి.శ. 140 కన్నా ముందు సేకరించ బడిన హదీసులివి. ఇందులో మొత్తం 1720 హదీసులుండగా, వాటిలో 600 'మర్ఫూ' ఉల్లేఖనాలు న్నాయి. (అంటే వాటి సనదు పరంపర దైవప్రవక్త – స– వరకూ చేరుతుంది). 617 హదీసులు 'మౌఖూఫ్'గా పరిగణించబడ్డాయి (అంటే వాటి సనదు పరంపర సహబీల వరకే చేరుతుంది). 222 హదీసులు 'ముర్సల్' కోవకు చెందినవి (ఏ హదీసుల సనదు తాబయీల వరకు మాత్రమే చేరుతుందో వాటిని ముర్సల్‌గా పేర్కొంటారు). 275 హదీసులు తాబయీలచే ఉటంకించబడినవి కూడా ఉన్నాయి.

ఇమామ్ మాలిక్ (ర) తన 'ముఅత్తా'ను సంకలనం చేసే నాటికి పండితులు వ్రాసిన మరెన్నో ముఅత్తాలు ప్రాచుర్యం లో ఉన్నాయి. "అయ్యా! ఈ 'ముఅత్తాల' మహా సముద్రంలో మీ ముఅత్తా నిండా మునిగిపోయేట్టు ఉంది కదా!" అంటూ కొంతమంది అనుమానం వ్యక్తం చేసినపుడు, "ఏది దైవ ప్రీతి కోసం జరిగిందో అది మిగిలి ఉంటుంది. మరేది దైవం కోసం జరగలేదో అది మిగలదు" అని ఇమామ్ మాలిక్ (ర) వ్యాఖ్యానించారు. యదార్థమేమిటంటే నేడు ఇమామ్ మాలిక్ గారి 'ముఅత్తా', ఇమామ్ ముహమ్మద్ బిన్ హసన్ షేబానీ గారి 'ముఅత్తా' తప్ప మరే ఇతర ముఅత్తా కూడా మిగల్లేదు, అన్నీ కాల గర్భంలో కలిసిపోయాయి.

ఈ గ్రంథంలో ప్రవక్త (స) వారి ప్రవచనాలతోపాటు సహబీల, తాబయీల ఫత్వాలు (తీర్పులు) కూడా పొందుపరచ బడ్డాయి. ఈ గ్రంథం కేవలం హదీసుల గ్రంథం కాదు కాబట్టి, ఇది "సిహా సిత్తా" లో చేర్చబడలేదు.

మస్నదె అహ్మద్ బిన్ హంబల్ (ర)

ఇది ప్రఖ్యాత ఇమామ్ హఫ్రత్ ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ – రహ్మ.లై – (జననం: హి.శ. 164 మరణంహి.శ. 241)గారి అపురూప హదీసు సంకలనం. ఇందులో మొత్తం 40 వేల హదీసులు ఉన్నాయి. దైవప్రవక్త (స) వారి మహితోక్తుల నిధిలో ఇది కూడా ఎంతో ముఖ్యమైనది. ఇందులో పునరావృతమైన హదీసులను తొలగిస్తే మొత్తం 28 వేల హదీసులు మిగులుతాయి.

మిష్కాత్

వివిధ హదీసు గ్రంథాలలో నుంచి గ్రహించి, ప్రత్యేకంగా రూపొందించిన గ్రంథమిది. తొలుత ఈ మిష్కాత్ గ్రంథాన్ని ఇమామ్ హుసైన్ బిన్ మస్‌వూద్ బగ్వీ (ర) (మరణం: హి.శ. 516) క్రోడీకరించారు. గ్రంథంలో ప్రతి అధ్యాయాన్ని రెండేసి తరగతులుగా విభజించి మొదటి తరగతిలో బుఖారీ, ముస్లింలలోని హదీసులు తీసుకున్నారు. రెండవ తరగతిలో నసాయీ, తిర్మిజీ, అబూ దావూద్, ఇబ్నె మాజాల హదీసులను సేకరించారు. ఈ హదీసులన్నీ ప్రామాణికమైన హదీసులుగా ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఈ కృషి జరిగిన రెండు శతాబ్దాల తర్వాత ఇమామ్ వలీయుద్దీన్ ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ ఖతీబ్ ఉమ్‌రీ (మరణం: హి.శ. 743) ప్రతి అధ్యాయంలోనూ మూడవ తరగతిని కూడా చేర్చి దానికి "మిష్కాతుల్ మసాబీహ్" అని నామకరణం చేశారు. ఈ మూడవ తరగతిలో సహీహ్‌తో పాటు హసన్, జయీఫ్, మౌజూ కోవలకు చెందిన ఉల్లేఖనాలకు కూడా చోటు కల్పించటం జరిగింది. మొత్తం మీద ఈ "మిష్కాతుల్ మసాబీహ్" గ్రంథంలో 6285 హదీసులున్నాయి.



రమజాను పోటీలు

సువర్ణావకాశాన్ని సద్వినియోగ పర్చుకోండి

ఈ పోటీలు వివిధ భాషల్లో నిర్వహించబడుతున్నాయి:
తెలుగు, తమిళ్, మళయాలం, సింగళం, హిందీ, చైనా, నేపాలీ,



మొదటి బహుమతి :	80 బీనార్లు
రెండవ బహుమతి :	70 బీనార్లు
మూడవ బహుమతి :	60 బీనార్లు
నాల్గవ బహుమతి :	50 బీనార్లు
ఐదవ బహుమతి :	40 బీనార్లు
ఆరవ బహుమతి :	30 బీనార్లు
ఏడవ బహుమతి :	మొబైల్ ఫోన్
ఎనిమిదవ బహుమతి :	మొబైల్ ఫోన్
తొమ్మిదవ బహుమతి :	మొబైల్ ఫోన్
పదవ బహుమతి :	మొబైల్ ఫోన్

గమనిక: ప్రతి బహుమతికి అన్ని భాషల్లోంచి ఒక స్త్రీ, ఒక పురుషుడు చొప్పున అర్హులు.



మొదటి బహుమతి :	80 బీనార్లు
రెండవ బహుమతి :	70 బీనార్లు
మూడవ బహుమతి :	60 బీనార్లు
నాల్గవ బహుమతి :	50 బీనార్లు
ఐదవ బహుమతి :	40 బీనార్లు
ఆరవ బహుమతి :	30 బీనార్లు
ఏడవ బహుమతి :	మొబైల్ ఫోన్
ఎనిమిదవ బహుమతి :	మొబైల్ ఫోన్
తొమ్మిదవ బహుమతి :	మొబైల్ ఫోన్
పదవ బహుమతి :	మొబైల్ ఫోన్

గమనిక: ప్రతి బహుమతికి అన్ని భాషల్లోంచి ఒక స్త్రీ, ఒక పురుషుడు చొప్పున అర్హులు.

రమజాను పోటీలు

(న్యూ ముస్లింలకు ప్రత్యేకం)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానం మీద టిక్ (✓) చేయండి.

1) 'ఏనుగుల సంవత్సరం' అని చెప్పడం ఎప్పటి నుండి మొదలయింది?

⊙ ప్రవక్త (స) వారి జననానికి 30 సంవత్సరాల ముందు నుండి ⊙ 60 సంవత్సరాల ముందు నుండి ⊙ 50 సంవత్సరాల ముందు నుండి

2) మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారు ఏ తేదీన జన్మించారు?

⊙ ఏనుగుల సంవత్సరం రబీవుల్ అవ్వల్ 13 ⊙ రబీవుల్ అవ్వల్ 14 ⊙ రబీవుల్ అవ్వల్ 12

3) దైవ ప్రవక్త (స) వారి తల్లిదండ్రుల పేర్లు ఏమిటి?

⊙ అబ్దుల్లాహ్ మరియు ఆమినా ⊙ అబ్దుల్లాహ్ మరియు జరీనా ⊙ అబ్దుల్లాహ్ మరియు సమీనా

4) దైవ ప్రవక్త (స) వారు బాల్యంలో పాల్గొన్న ఆ యుద్ధం పేరేమి?

⊙ హర్బుల్ ఫుజ్జార్ ⊙ హర్బుల్ తుజ్జార్ ⊙ హర్బుల్ నజ్జార్

5) తాత గారి మరణానంతరం దైవ ప్రవక్త (స) వారి పోషణా బాధ్యతను ఎవరు స్వీకరించారు?

⊙ అబూ లహబ్ ⊙ అబూ తాలిబ్ ⊙ అబూ బకర్

6) దైవదౌత్యం ప్రసాదించబడక ముందు దైవ ప్రవక్త (స) వారి బిరుదు ఏమిటి?

⊙ అల్ ముబీన్, అల్ ఆబిద్ ⊙ అష్షఫీ, అల్ హామిద్ ⊙ అస్సాదిఖ్, అల్ అమీన్

7) దైవ ప్రవక్త (స) వారు తన యౌవనంలో ఏ వృత్తిని చేపట్టారు?

⊙ క్రీడా నిర్వహణ ⊙ వ్యాపారం ⊙ పర్యాటన

8) దైవ దౌత్యానికి ముందు దైవ ప్రవక్త (స) వారు దైవారాధనలో గడిపిన ఆ గుహ పేరేమిటి

⊙ సౌర్ గుహ ⊙ హిరా గుహ ⊙ నూర్ గుహ

9) దైవ ప్రవక్త (స) వారిపై దివ్యావిష్కృతి అవతరించిన నాటికి ఆయన వయసు ఎంత?

⊙ 35 ⊙ 40 ⊙ 45

10) దైవ ప్రవక్త (స) వారి ఆడ మరియు మగ సంతానం ఎంత మంది?

⊙ 7 ⊙ 8 ⊙ 9

క్రింది సమాధానాలు కరెక్టా (✓) కాదా (☒) తెలుపండి

1) దైవ ప్రవక్త (స) వారి నడవడి ఖుర్ఆన్‌కు ప్రతిబింబం ( )

2) దైవ ప్రవక్త (స) వారి ఒంటె పేరు ఖస్వా ( )

3) దైవ ప్రవక్త (స) వారు మదీనాలో జన్మించారు ( )

4) దైవ ప్రవక్త (స) వారు సిరియా దేశానికి మొదటిసారి ప్రయాణమయినప్పుడు ఆయన వయసు 12 ఏండ్లు ( )

5) దైవ ప్రవక్త (స) వారి మగ సంతానం ముగ్గురు ( )

6) హిరా గుహ గల పర్వతం పేరు తూర్ పర్వతం ( )

7) దైవ ప్రవక్త (స) వారు సమస్త మానవాళి వైపునకు ప్రభవింపజేయబడ్డారు ( )

8) దైవ ప్రవక్త (స) వారి ధర్మ ప్రచారం ప్రారంభంలో బహిరంగంగా జరిగింది ( )

9) దైవ ప్రవక్త (స) వారు తన సహచరులతో ప్రారంభ దశలో దార్ - అర్ఖమ్‌లో సమావేశమయ్యేవారు ( )

10) హిజ్రత్ అనంతరం తొలుత నిర్మించబడిన మస్జిద్ మస్జిదున్నబవీ ( )

మీ వివరాలు

పూర్తి పేరు: .....

బతాఖా నెంబరు: .....

☎టెలిఫోన్ నెంబరు: .....

రమజాను పోటీలు

(ముస్లిమేతరులకు ప్రత్యేకం)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానం మీద టిక్ (✓) చేయండి.

1) **ఇస్లాం అంటే అర్థం?**
⊙ శాంతి ⊙ ఉగ్రవాదం ⊙ సన్యాసత్వం

2) **ఇస్లాంలో శాశ్వత జీవితం ఏది?**
⊙ ఇహలోకం ⊙ పరలోకం ⊙ రెండూ

3) **ఆకాశ (దైవ) గ్రంథాల్లో చిట్ట చివరి గ్రంథం ఏది?**
⊙ సువార్తలు ⊙ ఖుర్‌ఆన్ ⊙ వేదాలు

4) **ఇస్లాం ధర్మానికి మూల గ్రంథాలేవి?**
⊙ ఖుర్‌ఆన్ మరియు హదీస్ ⊙ పుక్కిటి పురాణాలు ⊙ రాజుల చరిత్ర

5) **ఇస్లాం ప్రబోధించే జీవన విధానం ?**
⊙ వైరాగ్యం ⊙ సంఘ జీవనం ⊙ రెండూ

6) **దేవుడు ఇస్లాం ధర్మాన్ని ఎవరి మార్గదర్శకత్వం నిమిత్తం పంపాడు?**
⊙ కేవలం అరబ్బుల కోసం ⊙ సమస్త మానవాళి కోసం ⊙ ఐరోపా మరియు ఆసియా కోసం

7) **ఇస్లాంలో ఆరాధించబడే దైవం?**
⊙ అల్లాహ్ ⊙ ముహమ్మద్ ⊙ మనిషి ఇష్ట ప్రకారం దేన్నయినా..

8) **ఇస్లాంలో హిజ్రి శకానికి మూలం ఏమిటి?**
⊙ దైవ ప్రవక్త (స) వారి వలస ప్రయాణం ⊙ దైవ ప్రవక్త (స) వారి జననం ⊙ మక్కా విజయం

9) **ఇస్లాంలో క్షమార్హం కాని పాపమేది?**
⊙ బహుదైవారాధన ⊙ నిషేధిత ప్రాణి వధ ⊙ దైవానికి అసత్యాన్ని ఆపాదించడం

10) **ఇస్లాం మూలాధారాల్లో ఒకటి?**
⊙ రోజా ⊙ న్యాయం ⊙ మంచీ చెడు విధివ్రాతలపై విశ్వాసం

11) ఖుర్‌ఆన్ ఏ మాసంలో అవతరించింది?
⊙ రమజాన్ ⊙ ముహర్రమ్ ⊙ జుల్ హిజ్జా

2) **ఖుర్‌ఆన్ గ్రంథం ఎవరిపై అవతరించింది?**
⊙ ముహమ్మద్ (స) ⊙ మూసా ⊙ ఈసా

3) **ఖుర్‌ఆన్ ఎవరి వాక్యం?**
⊙ అల్లాహ్ ⊙ ముహమ్మద్ ⊙ జిబ్రయీల్

4) **దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఎక్కడ జన్మించారు?**
⊙ మక్కా ⊙ మదీనా ⊙ ఇరాక్

5) **దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి వద్దకు దైవ వాణిని తీసుకొచ్చే దూత పేరు ?**
⊙ జిబ్రయీల్ ⊙ ఇస్రాఫీల్ ⊙ రిజ్వాన్

6) **దేవుని పట్టణాల్లోని ఓ పట్టణ సందర్శనార్థం స్తోమత గల ముస్లింలపై విధిగావించబడిన ఆరాధన ఏమిటి?**
⊙ హజ్జ్ ⊙ ఉమ్రా ⊙ పర్యాటన

7) **దేన్ని చూసి ముస్లింలు ఉపవాసాలుంటారు, విరమిస్తారు?**
⊙ నక్షత్రాలను ⊙ సూర్యుణ్ణి ⊙ చంద్రుణ్ణి

8) **ముహమ్మద్ ప్రవక్త (స) గురించిన ప్రస్తావన గల భారతీయ గ్రంథం పేరేమిటి?**
⊙ గీత ⊙ భవిష్య పురాణం ⊙ అధర్వణ వేదం

9) **భారత ఉపఖండంలో ఇస్లాం ఎవరి పరిపాలనా కాలంలో వచ్చింది?**
⊙ ఖలీఫా ఉస్మాన్ (ర) కాలంలో ⊙ అమీర్ ముఆవియా (ర) కాలంలో ⊙ వలీద్ బిన్ సులైమాన్ రాజు కాలంలో

10) **భరత ఖండంపై ఇస్లాం ఎలా ప్రవేశించింది?**
⊙ దండయాత్ర ద్వారా ⊙ అరబ్బు వర్తకుల ద్వారా ⊙ రెండూ

మీ వివరాలు

పూర్తి పేరు: .....

బతాఖా నెంబరు: .....

☎టెలిఫోన్ నెంబరు: .....

మేం మేనుష్యాం

- శాంతి ప్రియ

మేం మనుష్యులం – మేం విశ్వాసులం
దైవ దాసులం – సత్య ప్రియులం

మనస్సు లోపలి తమస్సు తొలగించి
అణగారిన సత్యాగ్ని కణం రగిలించి
మమతానురాగాల దివ్వెలు వెలిగించి
కష్ట జనులకై లేచు కరుణ కెరటంలాగా
దుష్ట జనులకై మండు నరక కూపంలాగా
మేం పోరాటానికి సిద్ధం
గెలుపు మాకు తథ్యం

మేం ఉపాసకులం – మాకు లేదు ఏ కులం
పరలోక పిపాసకులం – శాంతి కాముకులం
ధరిత్రి దశ దిశల ధర్మ తేజ తోరణాలు కట్టి
మనిషి బ్రతుక్కొక లక్ష్యం పెట్టి, శ్రుతి చుట్టి
మాట మాటకి మంచి బాట లాగ
అడుగు అడుగుకి ఆదర్శ మూట లాగ
మేం ఖుర్ఆన్ పారాయణం చేస్తాం
మేం ప్రవక్త బాటన నడుస్తాం

మేం సత్యవంతులం – అసత్యం మాకు అప్రియం
దైవ భక్తులం – స్వర్గవాసులం
పైశాచిక పోకడల పొత్తి కడుపుల్లో కత్తులు దూసి
భుక్త భక్తుల లోగుట్టుని బయటపెట్టి
రక్త సిక్త చరిత్ర రసికుల్ని మట్టుపెట్టి
రోత, రోధ, రుసూముల రొంపిని పూడించి
మేం కాంతికారులై వెలుగుతాం
మేం క్రాంతి వీరులై ఎదుగుతాం

మేం సుమనస్కులం – కర్కశత్వం కాదు మా గుణం
సాత్వికులం – సాహసవంతులం
మాలో మౌఢ్యం లేదు, మాలో క్రౌర్యం లేదు
నిమ్నోన్నతలు అస్సలు లేవు అంటరానితనం
మా దరి చేరదు
మాకు కుర్ఆన్ ఒక గీటురాయి, ధర్మదాయి
మాకు ముహమ్మద్ కరుణ చినుకు తురాయి
మేం వర్ణ పీడనలు సహించం
మేం మిథ్యా దేవుళ్ళను విశ్వసించం
విశ్వ మానవ సౌభ్రాతృత్వం మా విశ్వకర్త హితం
విశ్వ మానవ కణ్యాణం మా విశ్వనాయకుని అభిమతం

మూఢ నమ్మకాల బూజు దులిపి
మోస మోక్షపు తలుపు మూసి
దర్గా దుర్గాల గుట్టు విప్పి
స్వార్థ సంకుచితత్వాల చిచ్చు నార్పి
మేం చైతన్య రథసారథులవుతాం
మేం నవ సమాజాన్ని స్థాపిస్తాం

ఇందుగ్గాను –
నిలవాలి మీరందరూ ధర్మానికి అండగా!
లేదంటే మీరందరి బ్రతుకులు దండగా!!



వివేచన



అనుమాన భూతం

దాంపత్య జీవితం – అది నమ్మకం అనే బీజంతో ఎదిగే మహా వృక్షం.


దాంపత్య జీవితం – అది కేవలం అనుమానం అన్న విష వైరస్‌తో పుటుక్కుమని తెగిపోయే పచ్చి దారం.

కాబట్టి ఆలుమగలు తాము, కట్టుకునే అనురాగ గోపురంలో విష వాయువులు ప్రవేశించకుండా జాగ్రత్త పడాలి. ఎందుకంటే రాను రాను అవి పెనుభూతాలుగా మారి ఏకంగా ఇద్దరి జీవితాల్ని మింగేసే ప్రమాదముంది. భార్యాభర్తల మధ్య అన్యోన్నత, అనురాగం మూడు పూలు ఆరు కాయలుగా వర్ధిల్లాలంటే వారు షరీయతు సూచించిన హద్దులను గౌరవిస్తూ ఎవరి పరిమితుల్లో వారుండాలి. ఒకవైపు వేరుగా బ్రతకలేము అని చెబుతూనే భార్య మీద భర్త, భర్త మీద భార్య ఫిర్యాదు చేస్తూ తిరగటం నిరర్థకం, నిర్హేతుకం. ఒకరిలో ఉన్న లోపాలను ఇంకొకరు పెద్ద మనస్సుతో మన్నించాలి. ఏదేని విషయంలో మనిషి తీవ్ర సందిగ్ధానికి లోనైనప్పుడు ఖుర్‌ఆన్ వచనాల, ప్రవక్త (ﷺ) వారి ప్రవచనాల వెలుగులో పరిష్కారం చూపే పండితులను, వివేచనాపరులను, స్థితప్రజ్ఞులను సంప్రదించటం ఎంతో ఉత్తమం. ఆ మేరకు ఉపయోగపడే దైవ ప్రవక్త (ﷺ) వారి రెండు ప్రవచనాలను ఇక్కడ పొందుపరుస్తున్నాము.

ఓ పల్లెటూరి వ్యక్తి దైవ ప్రవక్త (ﷺ) వారి సన్నిధికి వచ్చి – "యా రసూలల్లాహ్! నేను తెల్లన, నా భార్య తెల్లన. కాని మాకిద్దరికి పుట్టిన పిల్లడు నల్లన" అని భార్య మీద తనకున్న అనుమానాన్ని వ్యక్తపర్చాడు. అది విన్న ఆదర్శ ప్రవక్త (ﷺ) "రెండు ఎర్రని ఒంటెలకు బూడిద రంగు ఒంటె పుట్టడం నీకు గమనించి ఉంటావు కదా! అది ఎలా సాధ్యం అయ్యుందంటావు?" అని ఎదురు ప్రశ్న వేశారు. అందుకా వ్యక్తి "బహుశా వాటి తాతముత్తాతలలో ఎవరి పోలికయినా వచ్చి ఉంటుంద"ని సమాధానమిచ్చాడు. "అదే విధంగా నీ కొడుక్కి కూడా నీ వంశస్థుల్లో ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది" అని దైవ ప్రవక్త (ﷺ) సెలవిచ్చారు. (ముస్లిం)

తొమ్మిది ఆయిషా (رضي الله عنها) కథనం – ఒక రోజు దైవ ప్రవక్త (ﷺ) సంతోషాతిశయంతో నా దగ్గరకు వచ్చారు. ఆయన ముఖారవిందం ప్రకాశిస్తూ ఉంది. నన్నుద్దేశ్యించి ఆయన ఇలా అన్నారు: "నీకు తెలుసా! ముజజ్జిజ్ ముద్‌లజీ ఇప్పుడే జైద్ బిన్ హారిసా మరియు ఉసామా (رضي الله عنهما)ను చూసి "ఈ కాళ్ళు పరస్పరం పోలికలు గలవి" అని అన్నారు (బుఖారీ,

అంటే – ఆ సమయంలో వారిరువురి ముఖాలపై దుప్పటి ఉంది. పాదాలు మాత్రం కన్పిస్తున్నాయి. కేవలం పాదాలు చూసి ముఖ సాముద్రిక విద్యలో నిష్ణాతుడైన ముద్లిజ్ తెగకు చెందిన ముజజ్జిజ్ నిదురిస్తున్న వారిద్దరూ ఒకే వంశ వృక్షానికి చెందినవారని చెప్పడం మహా ప్రవక్త (ﷺ) వారికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఎందుకంటే అప్పటికే ఉసామా బిన్ జైద్ (رضي الله عنهما) నలుపు రంగుపై కొంత మంది చెవులు కోసుకుంటున్నారు. ఉసామా గారి తండ్రి జైద్ బిన్ హారిసా (رضي الله عنه) తెల్లగా ఉండటం వారి సంశయానికి అసలు కారణం. ప్రస్తుతం రక్త పరీక్ష వల్ల ఈ పని సులువైపోయినప్పటికీ ఆ సౌకర్యం లేని, దాని గురించి తెలియని ప్రదేశాల్లో నివసించే ప్రజలకు ఇందులో అనేక నిదర్శనాలున్నాయి.



పాఠకులకు రమజాన్ శుభాకాంక్షలు!

ఉపవాస నియమాలు

ఈ క్రింది పరిస్థితులలో ఉపవాసం భంగమవుతుంది

1) సంకల్పాన్ని విరమించుకోవటం
2) వేళకు ముందే ఇఫ్తార్ చేయటం
3) తెలిసి తినడం, త్రాగటం
4) బలవంతం మీద వాంతి చేయటం
5) భార్యాభర్తలు లైంగిక సంబంధాలు పెట్టుకోవటం
6) స్త్రీ ఉపవాసం పాటిస్తుండగా బహిష్టు కావటం

ముఖ్య గమనిక : భంగమయిన రోజును తిరిగి పూర్తిచేయాలి. లైంగిక సంబంధాల వలన భంగమయిన రోజును పూర్తి చేయటంతోపాటు పరిహారం కూడా తప్పకుండా చెల్లించాలి.

పరిహారం : రెండు మాసాలు ఎడతెగకుండా ఉపవాసాలను పాటించాలి. (లేక) 60 మంది నిరుపేదలకు అన్నంపెట్టాలి.

ఈ క్రింది పరిస్థితుల్లో ఉపవాసం భంగం కాదు :

1) మరచి పోయి పదన్నా తినటం, త్రాగటం
2) మన ప్రమేయం లేకుండ దానంతట అదే వాంతి అయిపోవటం
3) దోమలాగ, ఈగ గాని యాదృచ్ఛికంగా నోటిలోకి వెళ్ళిపోవటం
4) వైద్య అవసరాల దృష్ట్యా శరీరం నుండి రక్తం తీయటం
5) ఉపవాస స్థితిలో ఎలాంటి ఉద్రేకం లేకుండ దీర్ఘశ్వాసం జరగటం



ఇఫ్తార్ దుఆ

అల్లాహుమ్మ లక సుమ్తు వబిక ఆమన్తు వఅలైక తవక్కల్తు

DAY వారము	రంజాన్ 1431	Aug 2010	సహర్ ముగియును	ఫజర్	ఇఫ్తార్ ప్రారంభం
WED బుధ	1	11	3:37	3:47	6:32
THU గురు	2	12	3:38	3:48	6:32
FRI శుక్ర	3	13	3:39	3:49	6:31
SAT శని	4	14	3:40	3:50	6:30
SUN ఆది	5	15	3:40	3:50	6:29
MON సోమ	6	16	3:41	3:51	6:28
TUE మంగళ	7	17	3:42	3:52	6:27
WED బుధ	8	18	3:43	3:53	6:26
THU గురు	9	19	3:44	3:54	6:25
FRI శుక్ర	10	20	3:44	3:54	6:24
SAT శని	11	21	3:45	3:55	6:23
SUN ఆది	12	22	3:46	3:56	6:22
MON సోమ	13	23	3:47	3:57	6:21
TUE మంగళ	14	24	3:47	3:57	6:20
WED బుధ	15	25	3:48	3:58	6:18
THU గురు	16	26	3:49	3:59	6:17
FRI శుక్ర	17	27	3:50	3:60	6:16
SAT శని	18	28	3:50	3:60	6:15
SUN ఆది	19	29	3:51	4:01	6:14
MON సోమ	20	30	3:52	4:02	6:13
TUE మంగళ	21	31	3:53	4:03	6:12
WED బుధ	22	SEP 1	3:53	4:03	6:11
THU గురు	23	2	3:54	4:04	6:09
FRI శుక్ర	24	3	3:55	4:05	6:08
SAT శని	25	4	3:55	4:05	6:07
SUN ఆది	26	5	3:56	4:06	6:06
MON సోమ	27	6	3:57	4:07	6:05
TUE మంగళ	28	7	3:57	4:07	6:04
WED బుధ	29	8	3:58	4:08	6:02
THU గురు	30	9	3:58	4:08	6:02

ఈ క్రింది నియమాలపై ఉపవాసంలో ఎలాంటి లోపం వర్తించదు :

1) నుర్మా పూసుకోవటం
2) వంటపై నూనె రాసుకోవటం
3) చల్లదనం కోసం స్నానం చేయటం
4) మిస్వాక్ చేయటం
5) సుగంధ ద్రవ్యాలు (సెంటు) వాడటం

పుణ్యప్రదమైన పనులు :

1) ఉషోదయానికి ముందు చివరి సమయంలో సహరీ భుజించటం, సూర్యాస్తమయం జరిగిన వెంటనే ఇఫ్తార్ చేయటం.
2) వీలైనంత ఎక్కువగా దానధర్మాలు చేయటం.
3) తరావీహ్ నమాజ్ చేయటం.
4) కనీసం ఒక్కసారైనా పూర్తి ఖుర్ఆన్ పారాయణం చేయటం (లేక) వినటం 5) ఉమ్రా చేయటం
6) ఏతెకాఫ్ పాటించటం, లైలతుల్ ఖద్ర్ అన్వేషణలో చివరి పదిరోజులు కృషి చేయటం.

లైలతుల్ ఖద్ర్ దుఆ

అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫఅఫు అన్ని

ఫిత్రా చెల్లించడం మరవకూడదు

నిరుపేదలను అనాథలను వితంతువులను మరిచిపోకూడదని అల్లాహ్ మరియు ప్రియ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆకీదు చేశారు.



సెల్: 66104547, 97248933 గమనిక : పండుగ నమాజు అల్ హామద్ తెలుగు మస్జిద్ముర్గాబ్ లో ఉదయం 8 గం॥ లకు జరుగును.